

# సమాగమం

సి. సత్యనారాయణరావు

నల్లమలై పర్వతశ్రేణులలో ఒక పర్వతం పేరు ఇంద్రగిరి.

ఒకనాడు ఇంద్రవైభవంతో వెలుగొందిన ఇంద్రగిరి హవేలి యీనాడు పురావస్తుశాఖ యాజమాన్యంలో చూడ వచ్చినవారికి చారిత్రిక చిహ్నంగా మిగిలిపోయింది.

కాని ప్రతి సంవత్సరమూ కార్తీక బహుళ ఏకాదశినాడు ఇంద్రగిరి హవేలి కళకళలాడుతూ వుంటుంది. తూర్పువైపున ఎత్తయినపర్వతశ్రేణి; వేసవిలోనూ, వర్షాకాలంలోనూ కూడా పచ్చదనం తగ్గని అడవులు; ఎక్కడనుంచో నిరంతరం ధారగా జాలువారే సన్నని జలపాతం; ఆ జలపాతానికి తావునిచ్చే కమలాల స్నానవాటిక; స్నానవాటికకు ఉత్తరాన రాణివాసం. రాణివాసంనుంచి స్నానవాటికకు మెట్లు; పడమటి దిక్కున దర్బారు హాలు- ఇదంతా చూడవచ్చినవారికి పురావస్తుశాఖ ఉద్యోగి విపులంగా చెబుతూ చూపిస్తున్నాడు.

నేను ఆ పురాతన కట్టడాలు, పాలుపోసి ఎత్తేలా వున్న దర్బారు హాలులోని ఎర్ర పాలగచ్చు, రాణివాసంలో అద్దంలో మొహం చూసుకున్నట్టు ఎదురుగావున్న వ్యక్తిని ప్రతిబింబించే తెల్లపాలరాళ్లు చూసిన తర్వాత స్నానవాటిక దగ్గర కెళ్లాను. స్నానవాటిక అట్టడుగు కూడా స్పష్టంగా కనబడేటంత స్వచ్ఛంగా వుందా నీరు. జలపాతం నీరు కోనేటిలోకి పడుతూన్నా కోనేరు ఎక్కడా ఒడుదుడుకుగా లేదు. అక్కడక్కడా కమలాలు చూడముచ్చటగా విరిసి వున్నాయి. ఆ స్ఫటికంలాంటి స్వచ్ఛమైన నీటిని చూసిన తర్వాత వొంగి దోసెడు నీళ్లు తీసుకొని తాగాను. ఎందుకో ఆ నీరు తులసివాసనల్ని గుబాళిస్తూ ఆలయాల్లో ఇచ్చే తులసితీర్థంలా వుంది. అలాంటి రుచి ఎలా వచ్చిందా అని మళ్లీ తాగిచూశాను. చిత్రమేమిటంటే కోనేటి అంచుల్లో రాయికీ రాయికీ మధ్యనున్న మట్టిలోంచి విష్ణుతులసి ఏపుగా ఎదిగివుంది. అలా ఏపుగా ఎదిగిన తులసి గుబురులు అంత ఆహ్లాదకరమైన స్నానవాటికను చూసి జలకాలాడ వలెనని ముచ్చటపడ్డట్టుగా గుబురుల్లోని సగభాగం కోనేటి నీటిలో మునిగి తేలుతూ వుంటాయి. అందుకే ఆ నీరు తులసితీర్థపు సువాసనల్ని వెదజల్లుతోంది.

అక్కడనుంచి ఇంద్రగిరి కోటతాలూకు ఆయుధ సామగ్రిని పదిలపర్చిన హాలు దగ్గరకు వెళ్లాను. నా వెంట పురావస్తుశాఖ ఉద్యోగి కూడా వున్నాడు. ఆ హాలును పరికించిన తర్వాత బయటికివచ్చి చూస్తే రాణివాసానికి ముందు పందిరి వేస్తున్నారు. పందిట్లో స్టేజి కడుతున్నారు.

"ఈ వేళ ఏదైనా తీర్థమా ఇక్కడ? లేకపోతే మినిస్టరుగారెవరైనా వస్తున్నారా?" అడిగాను పురావస్తుశాఖ ఉద్యోగిని.

"అదేం లేదండి! ఈ రోజున ప్రతి సంవత్సరమూ ఎక్కడనుంచో ఓ హరిదాసు వస్తాడు. తనకు నచ్చిన ఓ కథ చెప్పి మరునాడు వెళ్లిపోతాడు. అందుకే ఆ స్టేజి." అన్నాడతను.

"మరి జనమెవ్వరూ లేరే యిక్కడ?"

"లేకేమండీ! కోటలో జనం లేకపోయినా ఆ దిగువన కనబడే ఇంద్రగిరి పట్టణ ప్రజలు చీకటిపడేవేళకు కథ వినడానికి వచ్చి చేరతారు."

"అదేమిటయ్యా! సాధారణంగా హరికథ ఆలయంలోనో,

తరవాత పేజీ చూడండి....




ఆలయంముందో చెబుతారు. అలా పట్టణంలో కనబడుతున్న ఆ ఆలయంలో కథ చెప్పకోక యీ పాడుపడిపోయిన యీ కోటలో కథ చెప్పకోవడమేమిటి?" అడిగాను.

"అదో పెద్ద కథలెండి! చెప్పాలంటే రెండుమూడు గంటలు పడుతుంది. కాని ఒకటి మాత్రం చెప్పగలను. తమకి ఓపికవుంటే సాయంకాలందాకా వుండి ఆ హరిదాసు చెప్పే కథ విని వెళ్లండి."

"అంత గొప్ప కథకుడా?"

"ఎంత గొప్ప కథకుడో నేను చెప్పలేను. ఒకప్పుడు మీరిందాక చూపించిన ఆ దేవాలయంలోనే ప్రతిసంవత్సరమూ ఓ నెలరోజులపాటు హరికథ చెప్పేవాడట. అప్పటికి ఆయన వయస్సు పాతికేళ్లేనట. అతను కథ చెబుతూంటే ఆదిభట్ల నారాయణదాసుగారు ఈ రూపంలో వచ్చి చెబుతున్నాడా కథ అనిపించేదట జనానికి. ప్రస్తుతం తలనెరిసిన మనిషతను. చేతికర్ర ఆసరా లేందే నడవలేడు పాపం. ఈ ఏడాదికి ఈ కార్తీక బహుళ ఏకాదశినాడు ఒక్కరోజునే కథ చెబుతున్నాడిప్పుడు. అంత వయసు మళ్లినవాడయినా పట్టు తాపుతా ధరించి, కాళ్లకు గజ్జలు కట్టుకొని, చిరతలు చేత బట్టి ఆలాపన మొదలెడితే యీ కోటలోనూ, తూర్పున వున్న ఆ కొండల్లోనూ ఆ నాదం ప్రతిధ్వనిస్తుంది. ప్రేక్షకులు వొళ్లు మర్చిపోతారు. ఆ కథ వినాలేగానీ వర్ణించడం సాధ్యంకాదు." అన్నాడతను.

అతని మాటలు విన్న తర్వాత ఆ రాత్రికి ఆగి ఆయన కథ విని వెళ్లాలనిపించింది. ఆగిపోయాను.

కోట దిగువున వున్న ఇంద్రగిరి పట్టణంలోకి వెళ్లి ఓ హోటల్లో దిగాను. సాయంత్రం ఎప్పుడవుతుందా అని ఎదురుచూస్తూ ఏవో పత్రికలు తిరగేస్తూ కాలం గడిపాను.

చీకటి పడింది.

వీధి దీపాలు వెలిగాయి.

హోటల్‌బాయ్ వచ్చి, "మీ కింకా ఏమైనా కావలిస్తే చెప్పండి సార్. త్వరగా తెచ్చేస్తాను. ఎనిమిది గంటలకు కోటలో హరికథ వినడానికి వెళ్లాలి నేను." అన్నాడు బతిమాలుతూ.

డిస్కో-డ్యాన్సులూ, స్టంటులూ వుండే సినిమాలు చూడాలని సర్దాపడే యీ వయస్సులో యీ కుర్రాడు ఆయనెవరో చెప్పే హరికథమీద యింత మోజు, మక్కువా చూపెడుతున్నాడంటే ఆ కథలో ఏదో ప్రత్యేకత వుండే వుండాలనిపించింది.

"కథ అంత బావుంటుందా?"

"నేనేం చెప్పను సార్! వినాల్సిందేగానీ చెప్పడానికి మాటలు చాలవు సార్."

"ఇంతకీ ఏ కథ చెబుతాడాయన?"

"ఒకటేమిటి సార్! ఒక సంవత్సరం సీతాకల్యాణం, మరో సంవత్సరం రుక్మిణీ కల్యాణం, ఇంకో సంవత్సరం ఉషాపరిణయం, సత్యాభామా పాణిగ్రహణం.... అలా ఏదో ఒక కథ ఏటా చెబుతాడు. కథలో ఆ ప్రేమ సన్నివేశాలు వున్నాయి చూశారా, అవి ఆయనే చెప్పాలి సార్!" ఇంకా వాడేదో చెప్పకుపోతున్నాడు.

"సరేలే! నువ్వెళ్లేటప్పుడు చెప్పు. నేనూ వస్తాను." అన్నాను.

వాడికి చేటంత మొహమైంది.

"థ్యాంక్స్ సార్! అయితే ఇద్దరం కల్సే వెళదాం. దారి చూపించడానికి నన్ను మీరే తీసుకెళుతున్నారని చెప్పండి సార్ మా ప్రొప్రైటర్‌కు. లేకపోతే అరుస్తాడు," అంటూ బతిమిలాడాడు హోటల్‌బాయ్.

నవ్వుకొని "సరే" అన్నాను.

## 2

నేనూ, హోటల్‌బాయ్ స్టేజికి కాస్త దూరంగా స్నానవాటిక సావంచాలమీద కూర్చున్నాం. నీటిమీద నుంచి వీచే చిరు చలిగాలి గమ్మత్తుగా వుంది.

"ఇంతకీ ఈ దాసుగారి పేరేమిటి?" హోటల్‌బాయ్‌ను అడిగాను.

"అంతా దాసుగారు, దాసుగారనే అంటారు. అసలు పేరు నాకూ తెలీక, కిందకూడు మద్దెల వాయించే మద్దెల దాసుగార్ని అడిగాను. చిన్నప్పుడు అందరూ 'గోపీ' అనేవారట. కథలు

తరవాత పేజీ చూడండి....

నాకు తెలీకుండా ఒక పొరపాటు పని చేసాను.....




బాగా ముమ్మరంగా చెప్పే రోజుల్లో గోపాలందాసు అనే వారట. మొత్తంమీద 'గోపీ' అనుకోండి దాసుగారి పేరు." అన్నాడు హోటల్‌బాయ్.

గోపాలందాసు డెభ్భైయేళ్ల వృద్ధుడైనా ఆయన గళంలో ఆ వయస్సు కనబడదు.

గోపాలందాసు ఆలాపన ఆరంభించాడు.

ప్రక్క వాయిద్యాలు శ్రుతి సరిచేసుకుంటున్నాయి. హార్మోనియమ్ గోపాలందాసు ఆలాపనకు శ్రుతి కలిపింది. అలా ఆయన పూరించి, సుదీర్ఘంగా ఆలపిస్తూవుంటే అద మర్చి ప్రకృతి యావత్తూ తన్మయత్వం చెందుతోందా అనిపించేలా వుంది. మధ్యలో ఆయన ఆలాపన ఆపితే, కొండలోంచి అదే ఆలాపన సన్నగా ప్రతిధ్వనిస్తోంది. విఘ్నేశ్వర ప్రార్థన పూర్తిచేసుకుని, లేచి నిలబడ్డాడు గోపాలందాసు. నడుమునకు వున్న ఉత్తరీయాన్ని మరొక్కసారి బిగించాడు.

ప్రేక్షకుల్లోంచి ఇద్దరు లేచి, వేదికమీదకు వెళ్లి సంపంగి మాలను, గులాబిమాలను దాసుగారి మెడలో వేశారు.

ప్రేక్షకులచేత 'గోవింద' కొట్టించి, గోపాలందాసు పార్వతీకల్యాణం కథ ప్రారంభించాడు.

ఆయన తపోదీక్షలో వున్న పరమేశ్వరుణ్ణి, వారి ఉపచర్యల్లో వున్న ఉమాదేవినీ వర్ణిస్తూ వుంటే కళ్లముందు పార్వతీపరమేశ్వర్లు సాక్షాత్కరించినట్లే వున్నారు. పార్వతీదేవి అందచందాలను గోపాలందాసు వివరించి చెబుతూ వుంటే, తాను పార్వతీదేవిని స్వయంగా చూసి చెబుతున్నట్లో లేక తన మనస్సులో పదిలంగా దాచుకున్న ఏ సుందర రూపాన్నో పార్వతీదేవిగా వర్ణించి చెబుతూన్నట్లో వుంది. ఆయన వర్ణనను వింటూవుంటే, మూర్తిని చూడకుండానే ఏ చిత్రకారుడైనా ఆ రూపాన్ని కుంచెతో దిద్దుకోగలిగేటంత స్పష్టంగా వుంది. ఆయన తన చేతిలోని చిడతల లయకు అనుగుణంగా, మృదంగనాదంతో సమన్వయ పరుస్తూ, కాలి గజ్జల గలగలను మేళవించి, వేస్తూన్న అడుగు నృత్యకళకు పునాదులా అనిపిస్తున్నాయి. చెక్కుచెదరని మనోబలంతో, డెభ్భైయేళ్ల వయస్సు పైబడిన సంగతి మర్చిపోయి పార్వతీ కల్యాణం కథ విధానంలో ఒకసారి పరమేశ్వరునిగా, మరోసారి పార్వతిగా, వేరొకసారి పార్వతి చెలికత్తెగా, మన్మధునిగా, రతిగా, ఒక్క వ్యక్తి ఇన్ని పాత్రలలో లీనమై, తాదాత్మ్యంపొంది, తన్ను తాను మర్చిపోతూ ప్రేక్షకుల్ని కూడా మైమరిపిస్తూ చూపిన గోపాలందాసు ప్రజ్ఞను ఎవరు కాదనగలరు?

ఆయన సామాన్యుడు కాదనిపించింది నాకు.

రాత్రి తొమ్మిది గంటలకు ప్రారంభమైన కథ, తెల్లవారు ఝామున మూడుగంటల దాకా నిర్విరామంగా సాగుతూనే వుంది. అది కథ కాదు. అదొక కళాప్రవాహం, సంగీత వాహిని, సారస్వత జలపాతం.

ఒక్క వ్యక్తి కూడా ప్రేక్షకులనుంచి కదల్లేదు.

పండిత పామరజన సమరంజకం ఆ కథ.

నా చెవులూ, మనసూ ఆయన కథమీద, నా కళ్లు ఆయన ఆకృతిమీద కేంద్రీకృతమయ్యాయి. బక్కపలచగా, ఎక్కుపెట్టిన విల్లులా వున్నాడాయన. ఆయన కళ్లల్లో బాణాలవాడి వుంది. ఆయన వాచకంలో విశిష్టమైన స్పష్టత వుంది. ఆయన ప్రతి కదలికా ఒక ప్రత్యేక భంగిమ. ఆయన ప్రతి అడుగూ లయబద్ధమైన అపురూప పద విన్యాసం. ఆయనకు వయస్సు లేదు. వయస్సును అధిగమించిన కళాకారుడాయన. ఇంతటి ప్రజ్ఞాశాలి ఏడాదికి ఆ ఒక్క కార్తీక బహుళ ఏకాదశి రోజున ఈ ఇంద్రగిరి కోటలోనే హరికథ చెప్పడానికి కారణమేమిటో, మరెక్కడా, మరేరోజున ఎందుకు చెప్పడో తెల్సుకోవాలనిపించింది.

హరికథ పూర్తయింది.


నేను గోపాలందాసుగారి దగ్గరకు వెళ్లాను.

మద్దెలదాసు గోపాలందాసుగారికి పట్టిన స్వేదాన్ని ఒత్తుతున్నాడు.

అప్పటిదాకా హార్మోనియమ్ వాయించినతను విసెనకర్రతో విసురుతున్నాడు.

గోపాలందాసు అరమోడ్పు కన్నులతో చేతులమీద కాస్త వెనక్కు వాలి, సేద తీర్చుకుంటున్నాడు.

జనం నెమ్మది నెమ్మదిగా కథను పొగుడుకుంటూ, గోపాలందాసును మెచ్చుకుంటూ యిళ్లకు వెళ్లిపోతున్నారు.




కొంచెంసేపు ఆగి, "బాబూ! ఇంత అమోఘంగా కథ చెప్పారు. ఇంతటి ప్రజ్ఞనీ, ప్రావీణ్యాన్నీ తమలో వుంచుకొని, యీ ఇంద్రగిరి కోటకే పరిమితం చేయడం న్యాయమా? తక్కిన ప్రాంతాలకూ్కడా తమరు దయ చేయొచ్చుగా!" అన్నాను ప్రాధేయపూర్వకంగా.

అరమోడ్పు కన్నులను కాస్త విప్పార్చి, "హంసలు మానస సరోవరంలోనే విహరిస్తాయి. కోయిలలు వసంతంలోనే ఆలపిస్తాయి" అని మాత్రం బదులు చెప్పి "ఇహ పదండి" అంటూ పక్కనున్న వాయిద్యగాళ్లకు చెప్పి, తానూ లేచాడు గోపాలందాసు.

అక్కడనుంచి వెళ్లిపోయాడు.

ఎక్కడికో తెలీదు.

నా ప్రశ్నకు సమాధానం మాత్రం దొరకలేదు.

అసలీ గోపాలందాసుకూ, ఈ ఇంద్రగిరి కోటకూ సంబంధమేమిటి? ఈ ప్రశ్నకు జవాబు తెల్సుకోవాలనే కుతూహలంతో ఆ మర్నాడు కూడా ఆగిపోయాను.

ఆ మర్నాడు, "అదో పెద్ద కథలెండి." అన్నటువంటి పురావస్తుశాఖ ఉద్యోగిని కల్సుకొని, ఆ కథేమిటో వివరించమని అడిగాను.

నా కుతూహలం చూసి, అతనికి ఆ కథ వివరాలు చెప్పాలనిపించింది. అతనూ చదువుకున్నవాడు. మంచి అభిరుచిగల వ్యక్తిలా కనిపించాడు.

ఆ రోజు రాత్రి మే మిద్దరం ఇంద్రగిరి స్నానవాటిక ఒడ్డున కూర్చున్నాం.

దూరంగా పట్టణంలో వెలుగుతూన్న దీపాలు చీకటి





# VINOD VASTRALAYAM

*Dealers in :* QUALITY FABRICS SUITING'S & SHIRTING'S

*Authorised Dealers for :* RAYMONDS

BRINDAVAN BUILDINGS,
NAMPALLY STATION ROAD,
ABID CIRCLE, HYDERABAD-500 001.




చిక్కదనాన్ని మరింత పెంచుతున్నాయి. పట్టణం ముందున్న ముఖద్వారం దగ్గరున్న మెర్క్యురీ దీపం కోటలో కూర్చున్న మాకు నక్షత్రంలా కనిపిస్తోంది. కోట సింహద్వారం దగ్గర మరో దీపం వెలుగుతోంది. కోటలో అంతా చీకటే. నింగి లోని నక్షత్రాల వెలుగు తప్ప అంతటా చీకటే.

పురాతత్వశాఖ ఉద్యోగి కామేశ్వరరావు సిగిరెట్ ముట్టించి, "ఉదయం మీరు దర్బారుహాలులో ఈ కోటకు సంబంధించిన వస్తువులు చూశారు గదా!" అన్నాడు నిశ్శబ్దాన్ని చీలుస్తూ.

"అవును చూశాను."

"వాటిల్లో మీకేదైనా వింతగా కనబడిందా?"

"పురాతన వస్తువులన్నీ వింతగానే వుంటాయి."

"ఉహుఁ! అలా కాదు. ఆ వస్తువుల్లో ఒక వీణను చూశారు గదా!"

"ఆఁ! చూశాను. అదేమిటది! ఆ వీణ సగం కాలిపోయి వుంది."

"ఆ కాలిపోయిన వీణకూ, ఈ కోట కథకూ చాలా దగ్గరి సంబంధముంది. ఈ కోట పుట్టుక, చారిత్రిక సంఘటనలు మన కవసరం లేదుగానీ, గోపాలందాసుకూ, ఈ కోటకూ వున్న సంబంధం గురించి మీ రడిగారు గాబట్టి నేను చెప్పే కథ అంతవరకే పరిమితం చేస్తాను. కోటన్న తర్వాత కొన్ని యుద్ధాలు, విజయాలు, అపజయాలు, ముట్టడులు, తిరుగుబాట్లు వుండటం సహజం. కాని ఈ కోట గురించి నేను చెప్పబోయే కథ, తక్కిన కోటల కథల్లాంటి కథ కాదు. ఒక నూరేళ్ల క్రితం ఈ ఇంద్రగిరి కోట ఎంతో వైభవంగానే నిత్యకల్యాణం పచ్చతోరణంగా వెలుగుతూ వుండేది. కాని ఒక అరవై యేళ్లనుంచి దీని రూపురేఖలే మారిపోయినయ్. జమీందార్లు, రాజులు భరణాలమీద బ్రతికే రోజులొచ్చాక వారు కోటలను వొదిలేసి, సామాన్య జనంలో కలిసిపోయారు. అందరి రాజుల్లాగే ఈ కోటకు సంబంధించిన వారుకూడా బెంగుళూరులోనో, మద్రాసులోనో నివాసాలు ఏర్పరుచుకున్నారు. పెద్దలు గత వైభవాన్ని మర్చిపోలేక, ప్రస్తుత హీనస్థితిని భరించలేక బెంగతో కన్నుమూశారు. ఇక మిగిలిన ఏకైక వారసుడు రాజా భానోదయ వర్మ. కాని ఆయన పేరు కొద్దిమందికే తెల్సు. అందరూ చినబాబని అనేవారు. చినబాబు ఈ కోటకూ, ఇంద్రగిరి రాజవంశానికీ మిగిలిన ఏకైక వారసుడు; కడపటి వారసుడూ కూడా. ఆయన ఏడాదికొక్కసారి వచ్చి, రావల్సిన ఆదాయమేమైనా వుంటే వసూలు చేసుకొని, పక్కనే వున్న గోపాదవదిలో పెద్దలకు పిండప్రదానం చేసి వెళ్లిపోతూ వుండేవారు. ఈ కోటనూ, దీనికి సంబంధించిన ఆస్తినీ కంటికి రెప్పలా చూసుకొనే వ్యక్తి మాధవయ్య.

మాధవయ్య ఇంద్రగిరికోట సేవకుల్లో ఒకడు కాదు. ఇంద్రగిరి రాజవంశానికి చెందిన రాజబంధువే. కారణాంతరాలవల్ల గతిలేక అందరూ వొదిలిపోయిన ఆ కోటను వొదలకుండా గుట్టుగా బతుకుతున్నాడు. చాలామంది అతను ఆ వంశీకులకు నమ్మినబంటనుకొనేవారు. రాజబంధువని చాలా మందికి తెలియదు. మాధవయ్యకు మిగిలింది ఒక్క కౌముది. ఆమె ఆయన మనుమరాలు. ఆమె తల్లీ, తండ్రీ వరదలో పోవడంతో కౌముదికి మాధవయ్యే తల్లీ, తండ్రీ అయ్యాడు. కౌముదిని ఎంతోగారాబంగామాధవయ్య పెంచుకున్నాడు. నడకలు వచ్చేదాకా ఆయన గుండెలమీదే పెరిగింది కౌముది. నడకలువచ్చాక ఆయన కనుసన్నల్లో పెరిగింది. మాధవయ్యనేర్పినంతగానే తప్ప పెద్దగా చదువుకోలేదు కౌముది. అలా అని చెప్పి ఏమీ తెలియందికాదు. మాధవయ్య నేర్పగా మిగిలిన విద్యను ప్రకృతి పుస్తకంనుంచి చదువుకుంది కౌముది.

కోట సింహద్వారందాటి ఏనాడూ పట్టణంలోకి వెళ్ళి ఎరగదు కౌముది. మాధవయ్యే అవసరమైనప్పుడు పట్టణానికెళ్ళి కావల్సిన సరుకూ, సరంజామా తెచ్చేవాడు. ఆ రాణివాసం చుట్టూ పూలతోట వుండేది. ఆ తోటంటే కౌముదికి ప్రాణం. ఆ తోటలో కూర్చుని చల్లని గాలివీచినప్పుడు పురివిప్పి ఆడే నెమలిని చూసి విరిసినమల్లెలా నవ్వుతూ, నెమలిలాగే తనూ నడిచేది. అది గమనించిన నెమలి తన నడకకంటే కౌముది నడకే బావుందనిపించి, ఆమె ననుకరించేది. కౌముది గలగలా నవ్వి, నెమలిని ముద్దాడి ఈ కొండల్లోకి పారిపోయేది. ఈ జలపాతం ఎక్కడపుట్టిందో చూడాలనిపించి

వాత పేజీ చూడండి....




ఒక రోజున ఈ జలపాతం అంచునే నడుచుకుంటూ కొండపై దాకా వెళ్ళింది. తీరా అక్కడికి వెళ్ళాక నాలుగుమూలల నుంచీ వస్తున్న సెలయేటి జాలులను చూసి ఎటుపోయేదీ తెలియక ఓ చెట్టుకింద చతికిలబడింది. ఒక లేడిపిల్ల నీళ్ళు తాగడానికి వచ్చి దిగాలుపడి కూర్చున్న కౌముదినిచూసి భయపడి పారిపోకుండా, చేరువగా వచ్చింది. చీకటిపడింది యింతలో. అడవిలోని నక్కల అరుపులు, మృగాల గాండ్రింపులు వినవస్తున్నాయి. భయమేసి చేరువలోవున్న లేడిపిల్లను కౌగిలించుకుంది. అల్లంత దూరాన చీకట్లో కాంతివంతమైన దీపాల్లా కనిపించడంతో అదేదో జంతువేనని భయపడింది కౌముది. అదివిని ఎరిగిన కౌముది వొళ్ళోవున్న లేడిపిల్ల విలవిల్లాడింది. అది గ్రహించి లేడిపిల్లతోసహా కౌముది చెట్టెక్కి కూర్చుంది. ఆ రాత్రంతా అలా చెట్టుమీద గడిపి తెల్లవారేక లేడిపిల్లతోపాటు కొండదిగి కోటలోకి వచ్చింది.

ఆ రాత్రంతా మాధవయ్యకు నిద్రలేదు. కౌముది రాగానే మందలించాలనుకున్నాడు గానీ ఆమె కళ్ళముందు కనబడేసరికి, "తాతయ్యా!" అంటూ ఆమె ఆయన గుండెలమీద వాలిపోవడంతో, "పోనీలే అమ్మా! వచ్చేశావుగా! భయం లేదులే! నీ కోసం వూరంతా వెతికాను. తోటంతా వెతికాను. కోటంతా వెతికాను. ఎక్కడికి వెళ్ళావమ్మా?" అన్నాడు తలనిమురుతూ.

"జలపాతం ఎక్కడ పుట్టిందో చూద్దామని అడవిలో కెళ్లాను తాతా! అది తెలియలేదుగానీ, యీ లేడిపిల్ల దొరికింది." అంది బెదురుబెదురుగా.

"పిచ్చితల్లి! అడవిలో కెళ్ళావా? ఇంకెప్పుడూ వెళ్ళకమ్మా! జలపాతం ఎక్కడపుడితే నీ కెందుకమ్మా! ఎక్కడ పుట్టినా మన కోటలోకే వచ్చిపడుతూంది కదా!" అని అనునయంగా చెప్పి బుజ్జగించాడు.

## 3

కౌముది పద్దెనిమిది వసంతాలు నిండిన పడుచు. ఉదయాన్నే లేచి స్నానవాటికకు చేరి మొహం కడుక్కుంటోంది. అప్పుడే స్నానవాటికలోని నీటిమీద పడుతూన్న లేత అరుణ కిరణాల కాంతిలో నీరు బంగారు కాంతుల్ని వెదజల్లుతోంది. కొలనులోని తామరపూలు అలల కదిలికకు వయ్యారంగా వుయ్యాలలూగుతున్నాయి. కౌముది మొహం కడుక్కుని స్నానవాటికలోనికి స్నానానికి దిగింది. కోనేటి స్నానమంటే ఆమె కెంతో యిష్టం. ఆ ప్రశాంతమైన కోనేటి నీళ్ళలో జలకమాడుతున్న కౌముది కొలనులో ప్రతిబింబిస్తోన్న నిండు జాబిలావుంది. ఇవతలి వొడ్డునుంచి అవతలి వొడ్డుదాకా ఆమె రకరకాలుగా యీదుతూవుంటే, ఏదో పెద్ద బంగారుచేప యీదుతున్నట్టుంది. ఆమె తడిసిన శరీరం ఆ లేత అరుణ కాంతుల తాకిడికి మిలమిలా మెరిసిపోతోంది. అలా అలిసేదాకా ఆ కొలనులో జలకాలాడి ఒడ్డున కొచ్చింది.

కౌముది కళ్ళు మూసుకుంది.

కొండపైనుంచి పడుతోన్న జలపాతంయొక్క ధ్వని ఆమెకు వినిపించింది. అతడి బట్టలలోనే ఆ జలపాతధ్వనిలో మృదంగలయను విని, తదనుగుణంగా ఆమె పదవిన్యాసాన్ని ప్రారంభించింది.

ఎదురుగా తోటలో చిరుగాలికి కదులుతూన్న పూల కదలికకు అనుగుణంగా ఆమె శరీరం వివిధ భంగిమల్లోకి మారిపోసాగింది. గాని కదలికలో తనవెంట తెచ్చిన సన్నని ఈల పాటను శ్రుతిగాచేసుకొని కౌముది చిత్రమైన ఆలాపన చేయసాగింది. అలా ప్రకృతిలోని వివిధ కదలికలకూ, వివిధ ధ్వనులకూ అనుగుణంగా తన తనువును కదిలిస్తూ ఆ కదలికలకు నాదాన్నీ, లయనూ జోడించి స్వయంకృషితో ఒక చిత్రమైన నృత్యాన్ని ఆమె సృష్టించుకుంది. అది ఆమె నిత్య కళోపాసన. ప్రకృతి ఆమెగురువు. ప్రకృతినుంచి పుట్టిన సకల నాదాలూ, అందాలూ ఆమె నృత్యానికి హంగులు. అలా అలిసేదాకా ఆడి ఆడి, తాను పెంచుకొనే లేడిని ముద్దాడి, నెమలిని ఒకసారి నిమిరి_తనూ, తాతా వుండే ఇంట్లోకి వచ్చి, బట్టలు మార్చుకొని ముస్తాబైంది కౌముది.

కౌముది దర్బారు హాల్లోకి వెళ్లింది. అన్ని అలంకరణల తోటి నిండి వుంది హాలు. ఖరీదైన తివాచీలు, గోడలకు పులిచర్మాలు, అక్కడక్కడా గత వైభవాల ప్రతీకలుగా నిల్చిన రాజవంశీకుల తైలవర్ణ చిత్రాలు, దంతపు నగిషీలతో నిండిన ఖరీదైన నల్ల విరుగుడుచేవ కుర్చీలు, ఒక ఎత్తయిన

'రవాత పేజీ చూడండి....




(6)

వేదికమీద ఒక పెద్ద సింహాసనం ఆ హాలును దర్బారుహాలని చెప్పకయే చెపుతున్నాయి. సాధారణంగా చినబాబుగారు వచ్చినప్పుడు తప్ప ఆ హాలు తెరిచివుండదు. కాని వారానికి ఒకసారి కౌముది ఆ తలుపులు తెరిచి ఆ హాలునూ, గదులనూ శుభ్రంచేస్తుంది.

కౌముది కుర్చీలవెనక కొండచీపురుతో వూడుస్తోంది.

దర్బారుహాలు ద్వారందగ్గర పట్టుశాలువా కప్పుకొని, చెవులకు కుండలాలు, నుదుట కుంకుమబొట్టూ దిద్దుకొన్న ఒక వృద్ధుడు నిలబడ్డాడు. దర్బారు హాలులోకి పరకాయించి చూశాడు. ఆయన ఆ కోట పురోహితుడు. అరవై పైబడిన పెద్దమనిషి.

కుర్చీల వెనుక ఎవరో వ్యక్తి కదులుతూన్నట్టు గ్రహించి, "చినబాబుగారు వచ్చారా?" అన్నాడు.

ఆ మాటలు విన్న కౌముది, వూడ్చడం మానేసి, నిటారుగా నిలబడింది. చీపురు చేతబట్టుకొని కుర్చీ వెనకే వుంచింది.

"ఇంకా రాలేదండీ!"

"ఎప్పుడొస్తారమ్మా?" ఎంతో మర్యాదగా అడిగాడు పురోహితుడు సోమయాజి.

సోమయాజి చినబాబు వచ్చినప్పుడు మాత్రమే కోటలోకి వస్తాడు. గతంలో ఎప్పుడూ కౌముదిని ఆయన పరిశీలనగా చూడలేదు. చినబాబు హవేలీలో వుండగా కౌముది గానీ,

Your customers demand the best specialised foods. To prepare them, you need a versatile, heavy duty kitchen machine that does your type of food preparation efficiently and quickly.

INTRODUCING

**Sumeet SUPER A 100***

**The Kitchen Machine for hotels, canteens, snack bars**

A heavy duty kitchen machine, the Sumeet Super • Dry Grinds 1 - 1.5 kgs • Wet Grinds 2.5 - 3 litres • Liquidises 4 litres • Kneads 3 kgs • Minces 4 kgs • Whips 100 eggs • Mixes cake 4 - 5 kgs • Slices 4 kgs • Shreds 4 kgs • Chops 3 kgs... all in approximately 2 minutes per charge

* 1200 W, 230 V, 50 Cycles

**Complete with 12 Litre Stainless Steel Vessel for food processing
5 litre Stainless Steel Grinder jar**

*For details contact:* **PRISMA AGENCIES**
Adarsh Nagar, Hyderabad-500 483 Phone : 221349

తరవాత పేజీ చూడండి....




మరే స్త్రీలుగానీ ఆ ప్రాంతానికి రారు. చినబాబుకి స్త్రీలంటే గిట్టదని ప్రతీతి. అటువంటిది దర్బారుహాలు తెరిచి వుండటం, ఆ హాలులో పోతపోసిన వెన్నెల బొమ్మలా కౌముది అగుపించడం సోమయాజికి వింతగా తోచింది. కౌముది అందాన్నీ, ఠీవినీ, ఆమె మొహంలో గోచరించే రాజసాన్నీ చూసి ఆమె రాజవంశీకురాలే అనుకున్నాడు. అందుకే ఎంతో వినయంగా 'ఎప్పుడొస్తారమ్మా!' అని అడిగాడు.

కౌముది "తెలీదండీ!" అంటూ కుడిచేతిలో వున్న చీపురును ఎడమ అరచేతిలో కొడుతూ నిలబడింది.

అది చూశాక సోమయాజి ఆమె పనిమనిషై వుంటుందని నిర్ధారణ చేసుకున్నాడు.

"సరే! ఎల్లుండి ఉదయానికి చినబాబు తప్పకుండా రావాలి. వస్తాడు కూడా. వస్తే నేను వచ్చి వెళ్లానని చెప్పు. నే నెవరో తెల్సుగా! ఈ రాజవంశ పురోహితుడ్ని. సోమయాజిని." అని ఆమె సమాధానం కోసం ఎదురుచూడకుండా రాజాజ్ఞలా ఆదేశించి వెళ్లిపోయాడు.

కౌముది నవ్వుకుంది.

'చినబాబుతో నేను వచ్చి వెళ్లానని చెప్పు. నేనెవరో తెల్సుగా! నేను ఈ రాజవంశ పురోహితుడ్ని, సోమయాజిని. అచ్చు సోమయాజి అన్నట్టుగానే అని, తనే నవ్వుకొంది. చినబాబును నే నెప్పుడు చూశాను? నల్లద్దాల కారులో బుర్రు నొస్తాడు. కోటలో దూరతాడు. ఆయన హవేలీలో వున్నన్నాళ్లు తాత నన్ను బయటికే రానివ్వరు. ఆయనగారికి ఈయన గారొచ్చారని నే జెప్పాలా? ఆయనడిగితే చెబుతా- అని తనలో తనే మాట్లాడుకొంటూ హాలంతా శుభ్రంచేసింది. కుర్చీలు దులిపింది, పైగదులు కూడా తాళాలు తెరిచి శుభ్రం చేసింది. తిరిగి తనూ, తాతా వుండే ఇంటికొచ్చి, కాళ్లూ చేతులూ కడుక్కొంటూ వుండగా- ఊళ్లోకి వెళ్లిన మాధవయ్యతాత తిరిగొచ్చాడు.

"పురోహితుడు గారొచ్చారు తాతా!...." అని ఇంకా ఏదో చెప్పబోయింది కౌముది.

"దారిలో నాకు కనబడ్డాడమ్మా! ఆయన కలవడానికి ముందే పోస్టాఫీసు దగ్గర పోస్టుజవాను చినబాబుగారు పంపిన తంతి కూడా యిచ్చాడు నా చేతికి. రేపు సాయంకాలానికే చినబాబుగారొస్తున్నారు. ఆ విషయం పురోహితుడు గారిక్కూడా చెప్పాను. రేపు సాయంత్రంనుంచీ ఈ కోట మళ్లీ కళకళలాడుతూ వుంటుంది. కాని ఏం లాభం? చినబాబు మహా వుంటే ఒకరోజో రెండ్రోజులో వుంటాడు, వెళ్లిపోతాడు. మళ్లీ మామూలే. చీకటీ, నిశ్శబ్దమే," అన్నాడు మాధవయ్య దిగులుగా.

"ఇంత పెద్దకోట వొదిలుపెట్టుకొని ఏవేవో వూళ్లమ్మటే తిరగడం దేనికి? ఆ చినబాబును యిక్కడే వుండమని చెప్పొచ్చుగా!" తనకు తోచిన సలహా యిచ్చింది కౌముది.

"అమ్మో! చినబాబుకు ఎదురుపడి సలహా యివ్వడమే! ఎప్పుడైనా చెప్పగలిగితే, ఆ పురోహితుడుగారు అనాలే తప్ప మరెవ్వరూ చినబాబు కెదురుబడి ఏదీ చెప్పనూ లేరు, ఏ సలహానూ ఇవ్వనూ లేరు."

"చిన్నవాళ్లకు తెలీకపోతే పెద్దవాళ్లు చెప్పడం తప్పా?" అంది అమాయకంగా కౌముది.

"నీకు తెలీదులే అమ్మా! చినబాబు మనందరికీ పెద్ద. నీకీ గొడవలు అర్థంకావు. వారు వచ్చాక ఎప్పటిలా ఆ దర్బారు హాలువైపూ, హవేలీలోకీ పరుగులెత్తకు, వారికి ఆడవాళ్లంటే అసలు పడదు."

"ఏం? ఆడవాళ్లు ఆయన కంటికి దెయ్యాల్లా కనబడతారా? వారి అమ్మగార్ని ఆయన చూడలేదా? ఆమె కూడా ఆడదేగా?"

"నోర్ముయ్! రాజవంశాన్ని విమర్శిస్తున్నావా? నేను చెప్పినట్టుచేయి, చినబాబు యిక్కడ్నుంచి వెళ్లేదాకా అనవసరంగా బయటకు రాకుండా, ఇంటిపట్టునే వుండాలి నువ్వు. అర్థమైందా?" కౌముదిని గద్దించాడు మాధవయ్య.

కౌముదిని ఎప్పుడూ అంత కటువుగా మాట అనలేదాయన. అందుకే కౌముది విశాలనేత్రాలలో ఇట్టే నీళ్లు నిండాయి.

నోట బదులుచెప్పకుండానే 'సరే' నన్నట్టు కళ్లతోటే జవాబు చెప్పింది. అంత కటువుగా మాట్లాడినందుకు

మాధవయ్య మనస్సు చివుక్కుమంది. కౌముది కంటనీరు చూడటంతో ఆయన మనస్సు కరిగిపోయింది.

"నీకు తెలీదమ్మా! నిన్ను నా గుండెల్లో పెట్టుకొని దాచుకోవాలనే ఇన్ని జాగ్రత్తలు చెబుతున్నాను గానీ నిన్ను నొప్పించాలని కాదమ్మా! ఒక్కసారి నవ్వు తల్లీ! నువ్వు నవ్వకపోతే నా కాళ్లాడవు. నేను ఏ పనీ చేయలేను." బ్రతిమాలాడు మాధవయ్య.

పైటకొంగుతో కళ్లు వొత్తుకొని, గలగలాపారే గోదారిలా నవ్వింది కౌముది.

మాధవయ్య కళ్లల్లో తృప్తి మెరిసింది.

నిండుపున్నమి వెన్నెల కళ్ళముందు కాస్తున్నట్టు ఆనందించాడు మాధవయ్య. ఏ చిన్న మబ్బో అడ్డొచ్చి వెన్నెల కాంతి తగ్గినా ఆయన సహించలేడు. కౌముది ఎప్పుడూ నిండు పున్నమి వెన్నెల్లాగే ఆయన కళ్ళముందు మసలాలని ఆయన కోర్కె.

ఇంతలో చినబాబు వస్తాడన్న తంతి గుర్తుకొచ్చి హడావుడిగా ఆ ఏర్పాట్లలో పడిపోయాడు మాధవయ్య. వంటవాడ్ని ఏర్పాటుచేయడం, చినబాబు పొలాలు చేస్తున్న రైతాంగానికి తెలియబర్చడం, కావల్సిన వంటసామగ్రి, వస్తువులు సమకూర్చడం - ఈ ఏర్పాట్లల్లో పడిపోయాడు.

## 4

మధ్యాహ్నం మూడుగంటలైంది.

కొంతమంది రైతులూ, ఇదివరలో కోటలో పనిచేసిన మరికొంతమందీ, కోట సింహద్వారానికి ఇటూ అటూ నిలబడ్డారు.

పట్టణ ముఖద్వారం దగ్గరకు కారువస్తే కోట సింహద్వారం దగ్గరున్నవారికి కనబడుతుంది.

మాధవయ్యా, పురోహితుడు సోమయాజీ చినబాబు రాక కోసం ఆత్రంగా ఎదురుచూస్తున్నారు. ఒకప్రక్క పనులు పురమాయిస్తూ పట్టణ ముఖద్వారంవైపు ఓ కన్నువేసే వుంచాడు మాధవయ్య.

తామువుండే ఔట్‌హౌస్ గుమ్మంలో ముక్కాలిపీటమీద కూర్చుని అరచేతిలో గడ్డంపెట్టుకొని ఈ హడావుడినంతా పరికిస్తోంది కౌముది.

నీరెండల వేళకు నల్లద్దాల తెల్లకారు పట్టణ ముఖద్వారం దగ్గర అగుపించింది మాధవయ్యకు.



ఏమిటో నా గోల.... నాకు తెలీకుండా బొంబాయి పెళ్ళిచూపుల ముహూర్తం కొట్టుకున్నానని నే ఏడుస్తుంటే ......



(8)

'చినబాబొస్తున్నారు. చినబాబొస్తున్నారు' అంటూ హడావుడీ చేశాడు మాధవయ్య.

జనం తాము తెచ్చిన దండల్ని విప్పి సిద్ధంగా పట్టుకున్నారు.

కౌముది గుమ్మంలోనుంచి లేచి లోపలకు వెళ్లిపోయింది.

పురోహితుడూ, మాధవయ్యా కూడా కోటగుమ్మానికి చెరో పక్క నిలబడ్డారు. నిజానికి పట్టణ ముఖద్వారం దగ్గరనుంచి కారు కోట సింహద్వారానికి చేరడానికి పదినిముషాలు పడుతుంది. రెండు నిముషాల్లోనే అంతా సిద్ధమై చినబాబు ఆగమనంకోసం మిగిలిన ఎనిమిది నిముషాలూ నిరీక్షిస్తూ జనమంతా నిలబడ్డారు.

వచ్చిన జనం అంతా కల్సి ఇరవై మందికంటే లేరు.

కారు హారన్ కొట్టుకుంటూ వేగంగా దూసుకువచ్చింది.

కోట సింహద్వారందగ్గర ఓ క్షణం ఆగింది. చినబాబు కారు దిగలేదు. ముందుకు పోనివ్వమన్నాడు. కారు తిన్నగా దర్బారుహాలుముందాగింది.

నల్లద్దాల తలుపు తెరిచాడు డ్రైవరు కారు దిగి.

చినబాబు కారు దిగాడు.

మాధవయ్యా, పురోహితుడు తప్ప అందరూ నమస్కారాలు పెట్టి దండలు వేశారు.

చినబాబు కళ్ళకున్న నల్ల కళ్లద్దాలు తీయలేదు. చిరునవ్వుతోటే అందర్నీ పలకరించాడు. నమస్కారాలు పెట్టిన వాళ్ళకు ప్రతినమస్కారాలు చేశాడు. దర్బారుహాల్లోకి నడిచాడు.

దర్బారుహాలు ద్వారం దగ్గర జనం ఆగిపోయారు. మాధవయ్యా, సోమయాజీ మాత్రం చినబాబువెంట లోపలకు నడిచారు.

చినబాబు ఆరడుగుల ఎత్తు మనిషి. కాఫీరంగు జోధ్‌పూర్ సూట్ వేసుకున్నాడు. సరాసరి చినబాబు మేడమెట్లెక్కి పడగ్గదిలోకి వెళ్ళాడు. వెంట నడిచిన పురోహితుడూ, మాధవయ్యా కూడా అతని వెనక గదిలో కెళ్ళారు.

చినబాబు ఓ కుర్చీలో కూర్చున్నాడు. మాధవయ్యనూ, సోమయాజినీ కూర్చోమని సోఫా చూపించాడు.

వంటవాడు 'ట్రే'తో టీలు తెచ్చాడు.

టీని చప్పరించి, "రేపు నాన్నగారి తద్దినానికి అన్ని ఏర్పాట్లూ జరిగినట్లేనా?" అన్నాడు చినబాబు మాధవయ్యనూ, సోమయాజినీ ఉద్దేశించి.

"చిత్తం." బదులుచెప్పాడు మాధవయ్య.

ఇంతలో డ్రైవరు వీణ పెట్టెను పట్టించుకొనివచ్చి చినబాబు గదిలో పెట్టించాడు, మిగిలిన సామాన్లతోపాటు.

పురోహితుడు సోమయాజీ, మాధవయ్యా వీణ పెట్టెను చూశారు గానీ, 'తమరు వీణ సాధనచేస్తున్నారా?' అని అడగలేదు. చినబాబుకు అనవసర ప్రసంగం నచ్చదని వారిద్దరకూ తెలుసు.

"కాసేపు మేము విశ్రాంతి తీసుకుంటాం. ఉదయం కలుద్దాం." అని లేచి నిలబడ్డాడు చినబాబు.

రాజుల పద్ధతు లెరిగిన పురోహితుడూ, మాధవయ్యా "చిత్తం, మాకు సెలవిప్పించండి." అని చెప్పి, చినబాబు గది నుంచి బయటికొచ్చారు.

చినబాబు లేచి స్నానంచేశాడు. గ్లాస్కో పంచె, బెంగుళూరు సిల్కులాల్చీ ధరించాడు.

పడకగదికి ఆనుకొనివున్న బాల్కనీలో ఓ కుర్చీలో కూర్చున్నాడు. ఆ కుర్చీ కెదురుగా వున్న టీపాయ్‌మీద ఫ్లవర్ వేజ్‌లో ఎర్రగులాబీలు అమర్చివున్నాయి. అమర్చిన తీరు చాలా అందంగా వుంది. నెమ్మదిగా నీరెండలు తగ్గిపోయి, వెలుగుమాత్రం మిగిలింది. పున్నమి దగ్గరపడటంతో వెలుగు వుండగానే చందమామ ఉదయించాడు. ఆ బాల్కనీలో కూర్చుంటే కోటనుంచి పట్టణానికెళ్లే దారీ, పట్టణంలోని రాజవీధీ, రాజవీధికి కుడిపక్క ఆలయం, ఆలయంలోని ధ్వజస్తంభం స్పష్టంగా కనబడుతున్నాయి. పట్టణ ముఖద్వారం కూడా బాగానే కనబడుతోంది.

నెమ్మది నెమ్మదిగా వెలుగు తగ్గి, వెన్నెల బలాన్ని పుంజుకొంటోంది. చల్లదనాన్ని విరజిమ్ముతోంది.

కోటలో దీపాలు వెలిగాయి.

అది అసురసంధ్యవేళ. శివుడు తాండవించే వేళంటారు పండితులు.

చినబాబుకు ప్రయాణ బడలిక తగ్గింది.

కొండలమీదనుంచి వచ్చే చల్లని గాలి, చుట్టూ పాల వెన్నెల, పాలవెన్నెల్లో తడిసిన ప్రకృతి చినబాబు మనస్సుకు ఆహ్లాదాన్నిచ్చేయి. కుర్చీలోంచి లేచాడు. వీణపెట్టె దగ్గరకు వెళ్లి, వీణ తీసుకున్నాడు. శ్రుతి చేశాడు. తివాచీమీద కూర్చుని వీణా తంత్రువులను నెమ్మదిగా మీటసాగాడు. ఆ నాదం గదంతా నిండి కిటికీలగుండా బయట ప్రకృతిలో లీనమై, గాలిపైనుంచి కౌముది చెవులకు సోకించి.

ఒకచేత తంత్రువుల్ని మీటుతూ వేరొక చేతివేళ్లతో వీణ మెట్లపై స్వరాలు పలికిస్తూ ఏదో మధురానుభూతిని అనుభవిస్తున్నాడు చినబాబు. ఒక్కొక్క స్వరం వీణపై పలికించినప్పుడల్లా కౌమిది తనువు ఒక్కొక్క పులకింతకు గురి అవుతోంది. అతనలా సాధన సాగిస్తూవుంటే కౌముది ఇక ఆగలేక తన ఇంటినుంచి ఆరుబయటి కొచ్చింది. వీణానాదం మరీ స్పష్టంగా ఆమె చెవులకు సోకుతోంది. ఆ నాదానికి అనుగుణంగా ఆమె పాదం కదలసాగింది. తాత ఆదేశాన్ని కౌముది మర్చిపోయింది. పూలతోటలోకి వెళ్లింది.

పూలతోట చినబాబు బసచేసిన పడకగదికి చేరువగా ఉంటుంది. విరబూసిన పూల మధ్య పిండారబోసినట్లున్న వెన్నెల్లో వెన్నెల బొమ్మలాంటి కౌముది మైమరచిఆడుతోంది.

కాదు, చినబాబు వీణాగానం, ఆ గానంనుంచి పుట్టిన నాదం కౌముదిని ఆడిస్తున్నాయి.

ఇంతకాలమూ ప్రకృతినుంచి వినవచ్చిన రకరకాల నాదాలనూ, జలపాతంనుంచి పుట్టిన లయనూ ఆధారంగా చేసుకొని స్వయంకృషితో నృత్యాన్ని సాధనచేసిన కౌముది ఇప్పుడు చినబాబు వీణాగానంతో లయశ్రుతులను కలిపి నృత్యం చేస్తోంది. ఇదొక కొత్త అనుభూతి. చినబాబు వీణా సాధనలో ప్రకృతి గురించి పుట్టిన ధ్వనులకంటె స్పష్టత వుంది.

చినబాబు వీణావాయిద్యాన్ని దాదాపు అయిదారేళ్లుగా నేర్చుకుంటున్నాడు. ఎక్కడ గొప్ప వైణికుని కచేరీ అయినా అతను తప్పకుండా వెళతాడు. వెళ్లడమే కాకుండా ఎంతో శ్రద్ధగా విని చివరికి వైణికులతో చర్చించి విషయాలను తెల్సుకుంటాడు. ఇతర వ్యసనాలు అనేకం వున్నా చినబాబుకు వీణాసాధన దినచర్యగా అలవాటైపోయింది. రోజూ గంటల తరబడి సాధనచేసి తనలో తానే ఎంతో తృప్తిని పొందుతాడు. ఇదివరలో కోటకు వచ్చినప్పుడు వీణ వెంట తేలేదు. ఉదయానికి వచ్చి పని పూర్తిచేసుకొని, సాయంకాలానికే తిరిగి బెంగుళూరుకు వెళ్లిపోయేలాగా వచ్చేవాడు. ఈసారి ఒకరోజు ముందుగా రావడంతో వీణ వెంటతెచ్చాడు.


*With best compliments from*

**E.I.D.-PARRY (India) Ltd.**

"DARE HOUSE"

**MADRAS-600 001**

BOMBAY — CALCUTTA — NEW DELHI

Join atOnce

EFFICIENT POSTAL TUITION

1. M.B.A., M.B.M., D.B.A., A.M.I.B.A., B.G.L., M.A., M.COM., (FOR DEGREE HOLDERS)
2. D.COM., I.COM., B.COM., B.COM(HONS) M.COM., ALL ONE SITTING. (S.S.L.C./H.S.C./P.U.C./INTER PASSED OR FAILED ARE ALLOWED)
3. OSMANIA B.A., B.COM (ONE SITTING) (FOR P.U.C./INTER H.S.C. CANDIDATES)
4. B.A., B.COM., M.A., (M.U.) (NO PREVIOUS QUALIFICATION REQUIRED)
5. A.M.I.E., A.M.I.MECH.E EQUIVALENT TO B.E., (FOR S.S.L.C./P.U.C./H.S.C./CANDIDATES)
6. ALLOPATHY
7. E. HOMOEOPATHY
8. S.S.L.C., 9. H.S.C.,

POPULAR AND EFFICIENT INSTITUTE IN THE WORLD

FOR FULL PARTICULARS SEND Rs.3/- BY M.O.

SRI MURUGAN TUTORIALS

(ESTD: 21-3-1952 GOVT.REGD.NO. 3072)
H.O.: RISHIVANDIYAM-606 205 (T.N.)

R.O.: 41, ARCOT ROAD
KODAMBAKKAM, MADRAS 600 024

ఆ సాయంత్రం ఎంతో ప్రశాంతంగా ఉండటంతో మనస్ఫూర్తిగా వీణాసాధన ఆరంభించాడు. ఒక రకంగా వీణా వాయిద్యంలో చినబాబు బాగా ఆరితేరినాడనే చెప్పాలి. అతను వీణమీద పలికించనిది లేదు. కొద్దిపాటి అనుభవం గలవారు స్వరాలు, కృతులు వీణమీద అనగలరు. అనుభవజ్ఞులు ఆధ్యాత్మిక కీర్తనలు, భగవద్గీతలోని శ్లోకాలు కూడా వీణపై పలికిస్తారు. చినబాబు భగవద్గీత శ్లోకాలనే కాకుండా ఒక గొప్ప వేదపండితుని శుశ్రూశ చేసి స్వరబద్ధంగా వేదాలను చదివించుకొని, విని, వేదశ్లోకాలనుకూడా వీణమీద పలికించడానికి కృషిచేశాడు. సాధించాడు కూడా. అతను వీణపై ఏ రవళినైనా పలికించగలిగే సాధన చేశాడు.

అందుకే చినబాబు ఒక్క వీణమీద మృదంగనాదాన్ని, పక్షుల కిలకిలా రవళిని, సెలయేటి ప్రవాహపు గలగలల్ని అలా ఎన్నెన్నో ధ్వనుల్ని పలికిస్తాడు. సన్నాయి పాటకూడా వినిపిస్తాడు. ఈ శక్తి అతని నిరంతర కృషిఫలితం. అంతటి సమర్థుడు వీణ చేతపట్టి సాధన చేస్తోంటే తదనుగుణంగా కౌముది నృత్యంచేయడంలో వింతలేదు.

కౌముది అలా ఆ వెన్నెట్లో పూలతోట మధ్య చినబాబు వీణ సాధన చేస్తూన్నంతసేపూ మైమరచి ఆడింది. అది నృత్యమౌనో, కాదో శాస్త్రీయబద్ధమైందో కాదో ఆమెకు తెలియదు. ఆమె ఆడిన ఆటా, ప్రతి కదలికా, ప్రతి భంగిమా లయబద్ధమైన చినబాబు వీణాగానానికి ఆమె తనువు పొందిన స్పందన మాత్రమే. ఆమె చినబాబును చూడలేదు. చినబాబు తన గదిలో వీణాసాధన చేస్తూంటే ఆరుబయట తదనుగుణంగా కౌముది ఇంతసేపూ ఆడింది.

చినబాబు వీణాసాధనను ఆపాడు.

కౌముది ఏదో తీయని కలనుంచి అప్పుడే మేల్కొన్నట్టు ఈ లోకంలోకి వచ్చింది. పైటకొంగుతో మొహానికీ, మెడకూ పట్టిన చిరుచెమటలను వొత్తుకుంది. ఇంటివైపు నడిచింది.

దర్బారుహాలు ద్వారంనుంచి లేడిపిల్ల, లేగదూడ, నెమలి, ఒక నాగుపామూ వాటి దార్నవి బయటికెళ్లిపోతున్నాయి.

ఇంతవరకూ ఒక్కనాడు కూడా నాగుపామును కౌముది ఆ ప్రాంతంలో చూడలేదు. అలా ఆ పామూ, నెమలీ, లేడిపిల్లా, లేగదూడా దర్బారుహాలు ద్వారంనుంచి రావడం చూసి, అవి కూడా తనలాగే ఆ గానానికి ఆకర్షించబడి, అక్కడకు చేరివుంటాయని అనుకొంది.

ఇంతలో అల్లంత దూరాన కోట సింహద్వారం దగ్గర నలుగురైదుగురు నిలబడటం చూసి, "ఎవరు?" అంటూ అటు వెళ్లిందామె. వాళ్లల్లో ఒకడు, "గొడ్లను ఆ దారిన ఇంటికి తోలుకుపోతూ ఇక్కడేదో ఇంచక్కటి పాట విన

బడితే ఆగిపోయానమ్మా! నా ఎనకాలొచ్చిన యీళ్లూ ఆగిపోయారు. అడుగు ముందు కెయ్యబుద్ధికాలేదు. వెళ్లొత్తామమ్మా!" అంటూ ఒక అడుగు ముందుకేసి, మళ్లీ ఆగి, "అమ్మా! ఇంతకీ ఆ వాయించిం దెవరమ్మా?" అడిగాడతను.

'అవును. ఎవరూ! ఇంతసేపూ అంత అద్భుతంగా వీణాగానం చేసిందెవరూ? ఎవరై వుంటారు? ఈ వేళ కొత్తగా కోటకొచ్చింది చినబాబూ, డ్రైవరేగా? బహుశా చినబాబే అయివుండాలి.' అనుకొని "చినరాజావారు" అని సమాధానం చెప్పింది కౌముది.

"అందుకే అంత గొప్పగా వాయించగలిగా రదేదో!" అనుకొంటూ వాళ్లు వెళ్లిపోయారు.

సంగీతానికి పండితుల్ని, పామరుల్ని, పశువులను, పక్షులను ఆకర్షించే శక్తివుందని అంటారు. ఈవేళ అది నిజమని రుజువైంది_ అనుకొంది కౌముది. ఇంత తియ్యగా, ఇంత హాయిగా వీణాగానాన్ని చేసిన చినబాబు ఎలా వుంటారో? అనుకొంటూ, ఏదో వూహించుకొంటూ ఇంట్లోకెళ్లిపోయింది.

## 5

ఆ రోజు చినబాబు నాన్నగారి తద్దినం.

చినబాబు ఉదయాన్నే లేచాడు. కాలకృత్యాలు తీర్చుకొని, స్నానంచేసి కాఫీ కూడా తీసుకోకుండా ఎంతో నిష్ఠగా వున్నాడు. మిగితా రోజుల్లో ఎంత కులాసాగా కాలం గడిపినా తండ్రి తద్దినం రోజున మాత్రం చాలా పవిత్రంగా ఉండటం అలవాటు అతనికి.

పురోహితుడు సోమయాజి కోసం ఎదురుచూస్తున్నాడు చినబాబు.

మాధవయ్యా, సోమయాజీ వచ్చి చినబాబు పడకగది ముందు నిలబడ్డారు. తాము వచ్చినట్టు గదిలో వున్న చినబాబుకు కబురు పంపారు.

చినబాబు గదిలోకి అనుమతి తీసుకోకుండా ఎవరూ వెళ్లరు. చినబాబు అనుమతి తీసుకొని ఇద్దరూ లోపలికెళ్లారు.

పట్టు ధోవతీ, లాల్చీ ధరించాడు చినబాబు. కళ్లకు నల్లద్దాలు వున్నాయి.

"సిద్ధమేనా బాబూ!" అడిగాడు సోమయాజి.

"నీ కోసమే ఎదురుచూస్తున్నాను." అన్నాడు చినబాబు.

"నేనుతొందరగానే వచ్చేవాడ్నే. కాని తద్దినంమధ్యాహ్నం పన్నెండు తర్వాత పెట్టడమే శాస్త్రబద్ధం, అందుకని కాస్త ఆలస్యం చేశాను. తమరు సిద్ధంగా వుంటే నదీతీరానికి బయలుదేరదాం. ఏటాలాగే అక్కడ పెద్దలకు పిండప్రదానం చేసిరావచ్చు."

"సరే, బయల్దేరదాం." అంటూ చినబాబు లేచాడు.

**ROHINI** ENTERPRISES
2-1-340/6, Nallakunta, Hyderabad-500 044, Phone : 65813

*Main Distributors for A.P.*

"COATES Printing inks" Madras
"GANGES Printing inks" Bombay

AND

*Sole Selling Agents for A.P.*

PRESTO PRODUCTS, CALCUTTA
(Manufacturers of Picture Varnishes and Thinners)

మాధవయ్యా, సోమయాజీ, మరో బ్రాహ్మణుడూ చిన బాబుతోపాటు కారెక్కారు. నలుగురూ నదీ తీరానికి చేరి జరగాల్సిన కర్మకాండ ఒంటిగంటకల్లా పూర్తిచేసుకున్నారు. తిరిగి కోటకు చేరుకున్నారు.

ఆ రోజున చినబాబు మధ్యాహ్నం చాలాసేపు నిద్ర పోయాడు. సాయంత్రం బాగా చల్లబడ్డాక లేచాడు. నిన్నటి లాగే వీణాసాధన ప్రారంభించాడు,

చినబాబు పడకగదినుంచి వీణాగానం వినపడగానే కౌముదిలో ఏదో చలనం కలుగుతుంది. తనువు కంపిస్తుంది. మామూలుగా వెన్నెల వేళకు తోటలో పూలమొక్కల మధ్య చినబాబు వీణాగానానికి అనుగుణంగా నృత్యం చేయసాగింది. ఈసారి కాళ్లకు గజ్జలు కూడా కట్టుకుంది. గజ్జల సవ్వడి వీణా సాధనలో వున్న చినబాబు చెవిని సోకింది. అతను పూలవనంవైపు చూశాడు. కౌముది చేస్తూన్న నృత్యం ఎందుకో అతన్ని ఆకర్షించింది. ఆమెను పరీక్షించటానికా అన్నట్టు ఒకటి రెండు మూడు కాలాలలో స్వరాలు పలికిస్తూ ఆమెకు నృత్యం చేయడానికి అవకాశమిచ్చాడు. ఆమె చేస్తోన్న నృత్యం చూస్తే అది ఆమె అభ్యసించిన విద్య కాదని చినబాబుకు అర్థమైంది. అయినా ఆమెకు గల లయ జ్ఞానంతో ఆమెకు తోచిన రీతిలో అభినయిస్తూ నృత్యం చేస్తోంది. ఆమె నేర్చుకోకపోయినా ఆ నృత్యం ఎబ్బెట్టుగా లేదు.

మేడమీద పడకగదిలోంచి చినబాబు పూలతోటనూ, పూలతోటలోని కౌముదిని చూడగలడు గానీ తోటలోని కౌముదికి పడకగదిలో వున్న చినబాబు అగుపించడు. కౌముదిని చూసిన చినబాబు ఆమె నృత్యాన్ని లోలోనే మెచ్చుకుంటూ చాలాసేపు సాధన చేశాడు. అతను ఎంతసేపు సాధన చేశాడో అంతసేపూ కౌముది నర్తిస్తూనే వుంది. నిన్నటిలాగే వీణాసాధన ముగిసేవేళకు దర్బారుహాలు గడపలోంచి పామూ, నెమలీ, లేగదూడా, లేడిపిల్లా బయటకు రావడం కౌముది మళ్లీ చూసింది. అంతేగాక చినబాబు వీణా సాధన వింటూ కౌముది నృత్యసాధనను చూస్తూ సోమయాజీ, మాధవయ్యా తోటకు కాస్త ఎడంగా నిలబడి వున్నారు.

తోట సింహద్వారం దగ్గర నిన్నటికంటే ఈ రోజున వీణాగానాన్ని వినడానికి ఎక్కువమంది జనం చేరారు.

సాధారణంగా ఒకటి రెండురోజులుండి వెళ్లిపోయే చిన బాబు ఎందుకో ఈసారి అయిదు రోజులైనా బెంగుళూరుకు ప్రయాణం పెట్టలేదు. ఆయనంతట ఆయన బయలుదేరాలి గానీ, బయలుదేరదామని చెప్పే ధైర్యం డ్రైవరుకు గానీ, ఎప్పుడు బయలుదేరతారని అడిగే ధైర్యం మాధవయ్యకు


WITH BEST COMPLIMENTS FROM:



kamadhenu
TEXTILE COMPLEX
BESANT ROAD, VIJAYAWADA-520 002.
మిల్లువస్త్రముల ప్రత్యేక షోరూమ్
కామధేను
టెక్స్‌టైల్ కాంప్లెక్స్
బీసెంట్‌రోడ్. విజయవాడ -520 002.
PHONE: 62420

గానీ లేదు. అతను ఉన్నన్నాళ్లూ అతని పొలాలు చేసుకుంటూన్న రైతులూ, పురోహితుడు సోమయాజీ, గతంలో పనిచేసినఉద్యోగులూ వచ్చి చూసివెళుతూ వుండడం అలవాటు.

మాధవయ్య ఎప్పుడూ అతని పిలుపుకు అందుబాటులోనే వుంటాడు. ఈ అయిదు రోజుల్లో చినబాబు వీణ అమోఘంగా వాయించగలరన్న వార్త జనమందరికీ తెల్సింది. వెన్నెల వేళకు చాలమంది జనం కోటలోకి వొచ్చి వీణాగానం వినడానికి తహతహలాడుతున్నారు. ఆ వీణాగానానికి అనుగుణంగా నర్తించడానికి కౌముది పగలంతా ఎదురుచూసేది. సంధ్యవేళకు పురివిప్పిన నెమలై నర్తించేది.

అలా మరో అయిదురోజులు గడిచాయి.

ఇంత సావకాశంగా చినబాబు పురోహితునికి ఎన్నడూ దొరకలేదు.

ఆ రోజు పంచమి.

సోమయాజీ, మాధవయ్యా ధైర్యంచేసి ఒక ముఖ్యమైన విషయం చినబాబుతో మాట్లాడాలని నిర్ణయించుకున్నారు. కాని ఎప్పుడు ఎక్కడ ఎలా మొదలెట్టాలో అర్థంకావడంలేదు.

వారాస్థితిలో వుండగా పదిరోజులుగా ఎవరి వీణాగానానికైతే తాను నర్తిస్తూందో ఏ వ్యక్తి వీణాసాధనకు తాను మైమర్చిపోతోందో ఆ వ్యక్తిని చూడాలని తపన పడుతోంది. కాని ఎలా చూడాలో, చూడాలని వుందని మాధవయ్యతాతకు ఎలా చెప్పాలో తెలియక తనలో తనే సతమతమవుతోంది కౌముది.

ఒకరోజున దర్బారు హాలులోకి కూడా వెళ్లి మేడమెట్లు సగం వరకూ ఎక్కి కాళ్లు వొణకడంతో బయటికొచ్చేసింది. ఇప్పుడు సోమయాజీ, మాధవయ్య చినబాబును కలవడానికెళితే తననూ వెంటతీసుకెళ్లమని అడగాలనుకొంది. కాని చినబాబుకు ఆడవారు కనపడకూడదని తాతయ్య చెప్పిన మాటలు గుర్తుకొచ్చాయి. తనని చినబాబు చూడకుండా చినబాబును చూడటం ఎలాగా అని ఆలోచిస్తోంది కౌముది.

ఇంతలో సోమయాజి, "మనమిలా ఆలోచిస్తూ కూర్చుంటే ఆయనగారు రేపో ఎల్లుండో కారెక్కి బెంగుళూరు వెళ్లిపోతారు. మళ్లీ ఏడాదిదాకా దర్శనముండదు." అన్నాడు.

"మరేంచేద్దామంటారు?" అన్నాడు మాధవయ్య.

"చేయడాని కేముందయ్యా? వారి ఉప్పుతిన్నవాళ్లం, తింటూన్న వాళ్లం. వారి హితం కోరేవాళ్లం. మనం ధైర్యం చేయకపోతే ఇంకెవరు చేస్తారు చెప్పు?"

"ఆ మాటా రైటే అనుకోండి. కాని వారిముందు నిలబడి మాట్లాడేది ఎలాగా అని."

"నేను చెబుతాను, పద!"

*With best compliments from*

## BHAGCHANDKA BROTHERS

Plot No. A-1 & A-2, Industrial Estate, Vizianagaram-531 211 (A.P.)

Phone : 2022

*Manufacturers of*

MILD STEEL ROUNDS, FLATS, SQUARES, RIBBED STEEL RODS ETC.

"తమరొక్కరే వెళ్లండి."

"నువ్వు కూడా వస్తే ఏమవుతుంది?"

"ఏదో అవుతుందని కాదు. పురోహితుడిగా అది మీ బాధ్యత. నేనుండగా జ్ఞాతివాడిని కాబట్టి మనసు విప్పి మాట్లాడకపోవచ్చు. తమతో అయితే మనస్సులో వున్న విషయం సంకోచం లేకుండా చినబాబు చెబుతాడని నా నమ్మకం."

"చూడు మాధవయ్యా! చినబాబును చిన్నప్పట్నుంచీ చూస్తూనే వున్నాం. కుండ బద్దలుకొట్టినట్టు మాట్లాడటమే తప్ప మొహమాటాలూ, సంకోచాలూ ఆయనకు లేవు. కాదనక నడువ్."

ఇద్దరూ చినబాబు గదిలో కెళ్లారు.

"తమతో ఓ ముఖ్యమైన విషయం మాట్లాడాలని...." ఆగాడు సోమయాజి.

చినబాబు చిరునవ్వు నవ్వి "చెప్పండి" అన్నాడు ముక్తసరిగా.

సోమయాజి, మాధవయ్యవేపు చూసి "మరేం లేదు. పురోహితునిగా చెప్పడం నా బాధ్యత కాబట్టి చెప్పడమేగానీ, తమకు తెలియదని కాదు." అని ఆగాడు.

"ఫర్వాలేదు. మీరు చెప్పదల్చుకుంది చెప్పండి."

సిగరెట్ ముట్టించాడు చినబాబు.

"ఇంద్రగిరి రాజవంశానికి ఏకైక వారసులు మీరు." ప్రారంభించాడు సోమయాజి.

"ఆఖరి వారసుణ్ని కూడా," అన్నాడు చినబాబు.

"అలా కాకూడదనే నా ప్రయత్నం. ఇంద్రగిరి రాజ వంశం రాజ్యాలు పోయినా, రాచరికాలు లేకపోయినా కలకాలం ఈ భూమిమీద వుండవల్సిందే!" ఆవేశంగా అన్నాడు సోమయాజి.

"అదెలా సాధ్యం?" గంభీరంగా అన్నాడు చినబాబు.

"తమరొక యింటివారైతే...."

"ఇన్నాళ్లూ లేని ఆ ఆలోచన ఇప్పుడెందు కొచ్చింది మీకు?"

"ఇంతకాలం తమరే ఆలోచించి ఓ నిర్ణయానికొస్తారని ఎదురుచూశాం. కాలం గడిచిపోతోందే కానీ తమ నిర్ణయ మేమిటో మాకు తెలియలేదు."

"చూడండి సోమయాజిగారూ! మా పురోహితునిగా మా ప్రజల యొక్క, మా యొక్క యోగక్షేమాలు కోరటం తమ ధర్మం. కాని పరిస్థితుల్నిబట్టి మనిషి మారాలి. వెనుకటి రోజులు కావు యివి. ఇది రాజుల కాలమూ, జమీందారుల కాలం కాదు. రాజ్యాలూ, జమీలు లేవు ఇప్పుడు. గతంలో ఎంతటివాడైనా ఇప్పుడు సామాన్యుడిగా బ్రతకవల్సిందే! మీ మాటమీద నే నిప్పుడు ఒకింటివాడ్ని అయ్యానే అనుకోండి. నాకు సంతానం కలిగిందనుకోండి. వాళ్లెలా బ్రతకాలి? ఈ కోటకు మరమ్మత్తులు చేసి, వెల్లవేయించడానికే చాలదే ఈనాటి మన ఆదాయం! ఇంకా పెళ్లి, వంశం దేనికండీ!" అని సోమయాజి వాదనను కాదన్నాడు చినబాబు.





ప్రిస్మా ఏజన్సీస్, లబ్బీపేట్, హోటల్ కంధారి ప్రక్కన, విజయవాడ - 10

"నా మాటలా కొట్టిపారేయకండి. సిరిసంపదలు అనుభవించడానికి కాకపోయినా పున్నామ నరకంనుంచి రక్షించడానికైనా వంశాంకురం కావాలి. మీరు మొన్న మీ నాన్నగారికి పిండప్రదానం చేసినప్పుడు వారితోపాటు గత తరాల పితృదేవతలు కూడా పిండప్రదానానికి ఎదురుచూస్తూ వుంటారని మన శాస్త్రాలు చెబుతున్నాయి. తమకు వివాహం మీద ఆసక్తి లేకపోయినా తమ సంతతి అనుభవించడానికి తగినన్ని సిరిసంపదలు లేకపోయినా గతించిన తమ పెద్దల ఆత్మల తృప్తికోసమైనా తమరు వివాహం చేసుకోవడం, ఈ వంశం నిర్వంశం కాకుండా చూడటం తమ కర్తవ్యం." అలా తాను చెప్పదల్చుకుంది శాస్త్రబద్ధంగా వివరించాడు సోమయాజి.

చినబాబు ఒక క్షణం ఆలోచించాడు.

నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ, "ఏమిటో యీ ధర్మశాస్త్రాలు! ఆస్తి వుంటే దాన్ని అనుభవించడానికి ఒక వారసుడు కావాలి. కడుపున పుట్టినవాళ్లు లేకపోతే, పెంపు యివ్వడానికైనా చాలమంది ముందుకొస్తారు. ఆస్తి లేకపోతే పితృదేవతల ఆత్మ సంతృప్తికోసం పిండప్రదానం చేయడానికి ఒక వారసుడు కావాలి. అందుకు పెళ్లిచేసుకోవాలి. కాని ఈ వేళ నేనున్న పరిస్థితిలో పిల్ల నెవరిస్తారు సోమయాజిగారూ! ఎవరైనా నా దగ్గర ఏముందని పెళ్లిచేసుకోవడానికి ముందుకొస్తారు? చూస్తూచూస్తూ ఎవరో ఒకరి మెళ్లో తాళికట్టలేంగా!" తన మనస్సులోని మాట తెలియజేశాడు చినబాబు.

"ఆ బాధ్యత మా కొదిలేయండి. తమకు తగిన సంబంధం చూసే బాధ్యత మాది. ముందు మాకు కావల్సింది తమ సమ్మతి." అని అతని సమాధానంకోసం ఎదురుచూశాడు సోమయాజి.

"సరే! తమ యిష్టప్రకారమే కానివ్వండి" అని చెప్పి లేచాడు చినబాబు.

అతను లేచి నిలబడ్డాడంటే 'ఇహ మీరు వెళ్లొచ్చు' అని అర్థం.

విప్పారిన మొహాలతో మాధవయ్యా, సోమయాజీ చినబాబు పడకగదినుంచి బయటికొచ్చారు. కోనేటితీరాన కూర్చున్నారు.

"చినబాబుగారికి తగిన సంబంధం ఎవరున్నారు?" అన్నాడు మాధవయ్య సాలోచనగా.

"నేనూ అదే ఆలోచిస్తున్నాను. ఈ రాజ్యాలూ, జమీలు పోయాక రాజవంశీకులందరూ స్వస్థలాలు వొదిలేసి పట్టణాలకు వలసపోయారు. ఇంక చెప్పుకోదగినవాళ్లు ఎవరున్నారబ్బా?" అంటూ ఆలోచనలోపడ్డాడు సోమయాజి.

*With best compliments from*

INDIA BLOCK MAKERS

**VIJAYAWADA - 520 003**

**Phone : 72295**

ఇద్దరి మధ్యా కొంతసేపు నిశ్శబ్దం ఆవరించింది.

మువ్వల పటకాను లేడిపిల్ల మెళ్లో కడుతూన్న కౌముది అల్లంత దూరాన అగుపించింది సోమయాజికి.

"మాధవయ్యా! వుయ్యాలలో బిడ్డను పెట్టుకొని బిడ్డ కనబడ్డంలేదని వూరంతా వెతికినట్లుందయ్యా మనఅన్వేషణ!" అన్నాడు సోమయాజి ఎదురుగావున్న కౌముదిని చూస్తూ.

"మీరంటున్న దేమిటో నా కర్థంకావడంలేదు" అన్నాడు మాధవయ్య.

"అర్థంకాకపోవడాని కేముంది యిందులో! మీరు మీరు కావల్సిన వాళ్లేగదా! వారికి రాజ్యాలున్నప్పుడు దూరపు బంధువులేగానీ, ఇప్పుడు దగ్గరవాడివీ సమవుజ్జీవి కూడాను. ఇంతకంటే మంచి సంబంధం నువ్వున్న స్థితిలో కౌముదికి తేలేవు. చినబాబుగారి నాయనమ్మగారి పేరు రాణీ కౌముదీ దేవి. ఈ పెళ్లే జరిగితే నీ మనమరాలు, రాణీ చినకౌముదీ దేవి అవుతుంది. ఇంతకంటె ఏం కావాలయ్యా నీ జన్మకు?"

సోమయాజి మాటలు మాధవయ్యలో ఏదో విద్యుత్ ప్రవాహాన్ని ప్రసరింపజేశాయి. షాక్‌తిన్నవాడిలా ఒక్కసారి సోమయాజిని చూసి, "ఇది దురాశ అనిపించుకుంటుందేమో!" అని మాత్రమన్నాడు.

"కాదు. సహాయమే అనిపించుకుంటుంది" సోమయాజి సముదాయించాడు మాధవయ్యను.

"చినబాబు అంగీకరిస్తాడా?" అని.

"కౌముది అంగీకారాన్ని కూడా తెల్సుకోవాలి నువ్వు."

"దానిదేముంది! చిన్నపిల్ల."

"అవును. చినబాబు పెద్దవాడు."

—అక్కడితో వాళ్లిద్దరి సంభాషణ ఆగిపోయింది. పెళ్లి ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి.

## 6

ఆ రోజు మంచిరోజు.

కౌముదిని పెళ్లికూతుర్ని చేశారు. మాధవయ్యకు అడ దిక్కు లేకపోవడంతో పురోహితుడు సోమయాజిగారి భార్య వచ్చి చేయవల్సిన ఏర్పాట్లన్నీ చేసింది.

పెళ్లికూతురు అలంకరణలో కౌముది సిగ్గులు తొణికిస లాడుతున్న కుందనపు బొమ్మలా వుంది.

సోమయాజిగారి భార్య, ఇతర పేరంటాళ్లు కౌముది అందాన్నీ, అదృష్టాన్నీ ఎంతగానో కొనియాడారు.

మాధవయ్య కౌముది నెత్తిన అక్షంతలు వేస్తూ, "నువ్వ


Grams : "PAPER HOUSE" Phone : 73962

**SIDDAMSETTI ESHWARIAH & SON**

**Wholesale Paper Merchants**

Stockists of Paper, Boards, Stationery and Printing Inks

**7121 General Bazar, Secunderabad-500 003**

ఆరోగ్య సౌభాగ్యములకు మహిళలు

ఆధారపడునవి

ఆరోగ్య అనారోగ్య పరిస్థితులలో

లోధ్ర

*

గర్భపోషణకు. సుఖ ప్రసవమునకు

గర్భ రక్షక

*

వేవిళ్ళకు, మలబద్ధకమునకు

మాదీఫల రసాయనం

*

ప్రసవానంతర బలమునకు, క్షీరవృద్ధికి

సౌభాగ్య శొంఠి

*

కేసరి కుటీరం ప్రైవేట్ లిమిటెడ్
మద్రాసు - 600 014.

ఏజెంట్లు :
సీతారామ జనరల్ స్టోర్స్ (ఏజన్సీస్)
విజయవాడ - సికిందరాబాద్

చాలా అదృష్టవంతురాలివమ్మా!" అన్నాడు చెమ్మగిల్లిన కళ్లను వొత్తుకుంటూ.

తాను అదృష్టవంతురాలో, దురదృష్టవంతురాలో కౌముది ఏనాడూ ఆలోచించలేదు. కలదాన్ననీ, లేనిదాన్ననీ కూడా అనుకోలేదు. తనకి వూహ తెల్సిననాటినుంచీ కొండమీద పడే ఆ జలపాతమూ, ఆ కోటా, కొండలూ, కొలనూ, కొలనులోని కమలాలూ, పూలతోట— ఈ పరిసరాల్లో ఆడుతూ పాడుతూ కాలం గడపటమే తనకు తెలుసు. తను ఏ బాధా ఎరగదు. నవ్వులే కానీ కన్నీరు ఎరుగదు. ఈ పద్దెనిమిదేళ్ల జీవితాన్నీ ఆడుతూ, పాడుతూ, నవ్వుతూ, తుళ్లుతూ గడిపింది కౌముది.

పెళ్లికూతురైన తర్వాత ఆ సాయంత్రం తన్ను తాను అద్దంలో చూసుకుంది కౌముది.

ఇంతలో చినబాబు గదినుంచి మృదుమధుర వీణారవళి వినవచ్చింది. ఒక్కసారి కౌముది తనువు పులకించింది. ముఖకవళికల్లో భావం పెల్లుబికింది. అవయవాలు అభినయించ సాగాయి. స్వరానుగుణంగా పాదాలు కదిలాయి.

ఒక్క పరుగున ఆరుబయటికెళ్ళి పూలతోటలో మైమర్చి ఆడాలనుకుంది. గుమ్మందాకా వెళ్ళింది. తొలిసారిగా కౌముదికి సిగ్గు ముంచుకొచ్చింది. ఇంతటి మృదుమధుర మంజులా రవళిని అమృతధారగా తన వీణపై జాలువార్చే వారు - అదే, చినబాబుగారు-ఎంత అందంగా వుంటారో, ఎంతో అందంగా వుండి వుండకపోతే అంత తియ్యగా, అంత మృదువుగా వీణను ఎలా మీటగలరు! వారు వీణాతంత్రువులను మీటితే నా తనువే తంత్రువై కంపిస్తుంది. నేనిలా పిచ్చిగా ఆడుతూ వారికి కనిపిస్తే ఏమనుకుంటారు! ఉహూఁ!....ఆడను. ఆడకూడదు- అనుకొంది కౌముది. తనువును అదుపులో పెట్టుకోగలిగింది గానీ మనస్సు తుళ్ళిపడుతూనే వుంది. సెలయేరులా ఉరకలూ, పరుగులూ లేవుగానీ, నిర్మల నదీప్రవాహంలా మనస్సు గుంభనంగా పరుగులు తీస్తూనే వుంది.

అట్లా నాలుగురోజులు గడిచాయి.

ఆ రోజు పెళ్లిరోజు.

బంధువులు ఎక్కువగా రాలేదు. ఊళ్లోని జనం వచ్చారు. రాజలాంఛనాలప్రకారం పెళ్లి జరుగుతోంది. పెళ్లి జరుగుతున్నంతసేపూ పెళ్లికొడుకుకు పెళ్లికూతురు; పెళ్లికూతురికి పెళ్లికొడుకూ కనిపించకుండా మధ్యలో తెర అడ్డుకట్టారు. పెళ్లికూతురు జనానికి కూడా కనిపించదు. అగ్నిసాక్షిగా కౌముదీ, చినబాబుల వివాహం సాంప్రదాయబద్ధంగా జరిగిపోయింది.

ఆ రాత్రే శోభనం.

దర్బారుహాలుకు ఎడంపక్కగా, కోనేటికి చేరువగావున్న రాణీమహల్‌ను అలంకరించారు.

కౌముదిని అలంకరించి, పాలగ్లాసును చేతికందించారు. ముత్తైదువలు కౌముది చెవిలో ఏవేవో చెప్పి నెమ్మదిగా రాణీమహల్‌లోని రాణీవారి పడకగదిలోకి పంపించారు.

అప్పటికే చినబాబు ఆ గదిలో ఒక గుండ్రని వీణను శ్రుతిచేస్తున్నాడు. ఒక తంత్రువును మీటాడు.

కౌముది పాలగ్లాసు చేతబట్టుకొని తలుపుదగ్గర నిలబడింది. తలుపు బయటకులాగి ముత్తైదువలు మూసారు.

ఆ నాదాన్ని విన్న కౌముది వోరగా ఆటు చూసింది. చినబాబు అటుతిరిగి వున్నాడు. అతనిమొహం కనిపించలేదామెకు. అతని వేళ్ళమాత్రం వీణమెట్లపై కదులుతూ కనిపించాయి. సన్నగా, పొడుగ్గా వున్న అతని వేళ్ళు చూసేకొద్దీ చూడాలనిపించేలా వున్నాయి.

కౌముది అలా కొంతసేపు నిలబడింది. ఎంతకూ తన రాకను చినబాబు గుర్తించడంలేదని గ్రహించి, చిన్నగా దగ్గింది.

చినబాబు ఇటుతిరిగి కౌముదిని చూశాడు.

ఆమెచూపులు నేలవైపే వున్నాయి.

చినబాబు వీణను పక్కకు పెట్టి, బాలీసుపైనుంచిలేచాడు. కౌముదికి చేరువగా వచ్చాడు. ఆమె భుజంమీద చేయివేసి తన వెంట నడిపించుకొని మంచందాకా తీసుకెళ్లాడు. అతని కరస్పర్శతో కౌముది వెన్నెలా కరిగిపోయింది. అతను తన వెంట నడిపిస్తూవుంటే ఏదో గాలిలో దూదిపింజలా తేలిపోతున్నట్లనిపించిందామెకు. సిగ్గుదొంతరల బరువులో ఆమె చూపులు చినబాబు మొహాన్ని చూడలేకపోతున్నాయి.

"పాలగ్లాసు అలా చేతులలోనే వుండాలా?" అన్నాడు చినబాబు. అతనిమాట ఎంతో గంభీరంగా వుంది. ఆ గొంతు ధ్వని ఏదో శాసనంలా అనిపించింది.

ఆమె చేతిలోని పాలగ్లాసును అతని మొహంవైపు చూడకుండానే అతనికి అందించింది.

చినబాబు ఆ గ్లాసును అందుకున్నాడు. పక్కనేవున్న బల్లమీద పెట్టాడు.

"కూర్చో, ఫర్వాలేదు" అన్నాడు ఆమె చేయి పుచ్చుకొని కూర్చోబెడుతూ.

అతని పక్కనే ఆమె కూర్చుంది.

కౌముది కెందుకో చాలా భయంగా వుంది. అతని కళ్లల్లోకి చూడాలనివున్నా, సిగ్గుతో ఆమెకనురెప్పలు లేవటంలేదు.

"నేను వీణ వాయిస్తూవుంటే నువ్వు తోటలో నృత్యం చేయడం నేను చూశాను. నువ్వు నృత్యం నేర్చుకున్నావా?"


*Diwali Greetings from*

**RELIANCE GRAPHIC ENTERPRISES**

3-4-481/3, Barkatpura, HYDERABAD-500 027

***Distributors for***

**M/s. Union Carbide India Limited**

for Emmo and Golden Yellow Process Zinc Sheets

For all your requirements in Offset, Letter Press
and Block Making Materials

PLEASE CONTACT 65197

కౌముది కన్నెత్తకుండానే, లేదన్నట్టు తలవూపింది,

"నే ననుకున్నాను. నువ్వెక్కడా నేర్చుకొని వుండవని. లయజ్ఞానంతో ఆడుతున్నావేగానీ, పదవిన్యాసానికి అభినయానికీ పొంతన కుదరటంలేదు. శాస్త్రంలోని ముద్రలకు సమన్వయం లేదు. నీకు తోచిన రీతిగానే ముద్రలు చూపుతున్నావేగానీ, వాటిగురించి నీకు బాగా తెలియదని స్పష్టమవుతున్నది. అయినా నీ నృత్యం చూడ్డానికి బాగానే వుంది. ఇలా కొన్నాళ్ళు నువ్వు కృషిచేస్తే నీదీ ఒక కొత్తబాణీ కావొచ్చు"

అలా చినబాబు మాట్లాడుతూవుంటే ఒక పెద్ద గురువుగారి దగ్గర శిష్యురాలిలా బుద్ధిగా వుండిపోయింది కౌముది.

"వీణమీద నే నొక జావళీ అంటాను. నీకు చేతనైనట్టు నృత్యం చేస్తావా?" గోముగా అడిగాడు చినబాబు.

మనస్సులో 'సరే' అని అందామనినావ్వు, సిగ్గుతో తల వొంచుకొనే అడ్డంగా వూపింది కౌముది.

"సిగ్గా?"

కౌముది మాట్లాడలేదు.

"రాదా?"

దానికి బదులు పలకలేదు కౌముది.

"నిన్నెలా కదిలించాలో, ఎలా పలికించాలో నాకుతెల్సులే!"

అంటూ మంచంమీదనుంచి లేచాడు చినబాబు. బాలీసు దగ్గరకు వెళ్ళి వీణను తీసుకున్నాడు.

ఒకచేత తంత్రువుల్ని మీటుతూ, మరో చేతివ్రేళ్ళు మెట్లపై కదిలేసరికి గదినిండా ఏదో మధురనాదం నిండిపోయింది. ఆ నాదంలో కౌముది తేలిపోతోంది.

చినబాబు జావళీని వీణపై అనేసరికి కౌముదిలో కదలిక వచ్చింది. అభినయించసాగింది. ఆ అభినయంలో అపకోకుండా వీణ వాయించడంలో నిమగ్నుడై వున్న చినబాబు మొహంలోకి చూసింది.

చినబాబు మొహం చూసిన మరుక్షణమే సెలయేరులా పురకలువేస్తూన్న కౌముది ఘనీభవించిపోయింది. ఆ అందాల నాతి రాయిగా మారిపోయింది.

చినబాబుకు

—ఒక కన్ను లేదు. ఎప్పుడో పేటలో పోయిందట.

—మొహంనిండా స్ఫోటకం మచ్చలు.

—కళ్ళలో మిగిలిన ఒకటి ఎర్రగా చింతనిప్పులా వుంది.

—పేరు చినబాబుగానీ, చినబాబు మాధవయ్యేకంటే అయిదారేళ్ళు మాత్రమే చిన్నవాడు - మొహం చూడగానే యాభై దాటినవాడిలా స్పష్టంగా కనబడతాడు.





తాను ఊహించుకున్న చినబాబుకీ, తన కళ్ళముందున్న చినబాబుకీ ఎక్కడా పొంతనలేదు. తన ఊహల్లోని చినబాబు ఒక యువరాజు. మన్మథాకారుడు. చూపులతోనే మైమరపించ గలిగే శృంగారపురుషుడు. కాని ఇతను కటువుగా, మొరటుగా, గంభీరమైన బొంగురుగొంతుతో, అందవికారంగా, నడి వయస్సు దాటి, - తనేదో అగాధంలోకి పడిపోయినట్లనిపించింది కౌముదికి.

ఒక నిముషంసేపు వీణ వాయించిం తర్వాత కదలిక లేకుండా నిలబడివున్న కౌముదిని చూసి వీణ వాయించడం ఆపివేశాడు చినబాబు.

ఆమె చలనంలేని నిర్జీవప్రతిమలా రెప్పకూడా ఆర్పకుండా శూన్యంలోకి చూస్తూ నిలబడిపోయింది.

వీణను బాలీసుపై వుంచి, తను లేచి ఆమెకు చేరువగా వెళ్ళాడు. పులిచేరువవుతున్న లేడిలా వాణికిపోయిందికౌముది. నిశ్శబ్దంగానే పై కనురెప్ప ఎత్తి అతని మొహంలోకి చూసింది. ఆమె చూపులనిండా భయం కనిపించింది చినబాబుకు.

ఆమె నెత్తిపై చేయివేసి, భయం లేదన్నట్టు చూపులతోచే చెప్పి, పక్కన బల్లమీదున్న కళ్ళజోడు పెట్టుకొని బయటకు నడిచాడు చినబాబు.

అదీ కౌముది తొలిరాత్రి.

## 7

కౌముదిలో ఇదివరకటి చలాకీతనంలేదు. ఒకప్పుడు చుట్టూ వున్న ప్రకృతిని చూసి స్పందించేది. ఇప్పుడు ఆ ప్రకృతి యొక్క ప్రభావం కూడా కౌముదిమీద లేదు, లేడిపిల్ల పరిగెడితే తనూ పరుగెత్తేది, నెమలి పురివిప్పి ఆడితే తనూ జతచేరి ఆడేది. ఇప్పుడు నెమలి ఆడినా, లేడి పరిగెత్తినా అలా బొమ్మలా చూస్తూ నిలబడుతుందే తప్ప తను చలించదు.

ఆమె రాణీమహల్‌లోనే వుంటోంది.

చినబాబు కాసేపు దర్బారు హాల్లోవున్నా ఎక్కువసేపు వీణాసాధనమ చేసుకుంటూ రాణీమహల్‌లోనే వుంటాడు. కాకపోతే కౌముది వుండే గది వేరు; చినబాబు వుండే గది వేరు. ఎంత ఆహ్లాదకరంగా వీణపై చినబాబు గానంచేసినా


భారతీయ సాహిత్య నిర్మాతలు పరంపరలో కేంద్ర
సాహిత్య అకాడమీ తెలుగులో ప్రచురించిన పుస్తకాలు

| | | |
|---|---|---|
| 1. | పోతన | రూ. 4-00 |
| 2. | గురజాడ | రూ. 4-00 |
| 3. | వేదం వేంకటరాయశాస్త్రి | రూ. 2-50 |
| 4. | బాణభట్టు | రూ. 2-50 |
| 5. | బంకించంద్ర ఛటర్జీ | రూ. 2-50 |
| 6. | బసవేశ్వరుడు | రూ. 2-50 |
| 7. | బి.ఎం. శ్రీకంఠయ్య | రూ. 2-50 |
| 8. | చందుమేనన్ | రూ. 2-50 |
| 9. | ఫకీర్ మోహన్ సేనాపతి | రూ. 2-50 |
| 10. | గాలిబ్ | రూ. 2-50 |
| 11. | ఈశ్వర చంద్ర విద్యాసాగర్ | రూ. 2-50 |
| 12. | జీవనానంద దాస్ | రూ. 2-50 |
| 13. | కంబ మహాకవి | రూ. 2-50 |
| 14. | కేశవసుత్ | రూ. 2-50 |
| 15. | కుమరన్ ఆసాన్ | రూ. 2-50 |
| 16. | లక్ష్మినాథ బెజ్బరూవా | రూ. 2-50 |
| 17. | మాణిక్ బంద్యోపాధ్యాయ | రూ. 2-50 |
| 18. | మీరాబాయి | రూ. 2-50 |
| 19. | నానాలాల్ | రూ. 2-50 |
| 20. | రాజారామమోహన్ రాయ్ | రూ. 2-50 |
| 21. | శ్రీ అరవిందులు | రూ. 4-00 |
| 22. | సరోజిని నాయుడు | రూ. 2-50 |
| 23. | తారాశంకర్ బంద్యోపాధ్యాయ | రూ. 2-50 |
| 24. | తోరుదత్ | రూ. 2-50 |
| 25. | వళ్ళత్తోళ్ | రూ. 2-50 |
| 26. | భారతేందు హరిశ్చంద్ర | రూ. 4-00 |
| 27. | పంజె మంగేశరావు | రూ. 4-00 |
| 28. | భారతి | రూ. 4-00 |
| 29. | బుద్ధదేవ బోస్ | రూ. 4-00 |
| 30. | మహాకవి ఉళ్లూర్ | రూ. 4-00 |
| 31. | మాణిక్క వాచగర్ | రూ. 4-00 |
| 32. | జ్ఞానదేవుడు | రూ. 4-00 |
| 33. | రాహుల్ సాంకృత్యాయన్ | రూ. 4-00 |

సాహిత్య అకాడమీ
బొంబాయి - మద్రాస్ - కొత్తఢిల్లీ - కలకత్తా
దక్షిణప్రాంతీయ కార్యాలయం : 29, ఎల్డామ్స్ రోడ్, మద్రాస్ - 600 018
* కావలసిన వారికి అన్ని ప్రచురణల వివరాలూ ఉన్న కేటలాగ్ పంపగలము *

ఆమెకు స్పందన కలగడంలేదు. ఆమెలో చలనం లేదు. అసలు ఆమె వింటోందో లేదోకూడా తెలియదు.

బయటి ప్రపంచానికీ, మాధవయ్యకూ కౌముదిలో వచ్చిన మార్పు ఏమిటో స్పష్టంగా తెలియదు. మార్పు వొచ్చిందని మాత్రం తెలుసు. ఆ మార్పు శిఖరాగ్రస్థాయికి లేచిన ఆమె వూహల తియ్యని మేడ పేకమేడై కూలిపోవటంచేత వచ్చిందని ఎవ్వరికీ తెలియదు. తానేదో కౌముదికి అన్యాయం చేశానని చినబాబే మనస్సులో అనుకొనేవాడు. ఆమె అలా రాతిబొమ్మలా అయిపోయినందుకూ, తనకు చేరువకానందుకు జాలిపడ్డాడేగానీ కోపగించుకోలేదు.

మాధవయ్యా, సోమయాజీ కౌముదికి పెళ్లికావడం మూలంగా ఆ మార్పు వచ్చిందేమో అనుకున్నారు. ఎప్పుడూ చెంగుచెంగున గెంతుతూ త్రుళ్లుతూ పరుగులు తీసే కౌముది నిండుగా, నెమ్మదిగా నడుస్తూందిప్పుడు. వాలుజడ మానేసింది. ముడి చుట్టుకుంటోంది. నుదుట పెద్దబొట్టు పెట్టుకొంటోంది. ఎప్పుడూ కొంగు నిండా కప్పుకొనే వుంటుంది. వయస్సు పద్దెనిమిదే అయినా నలభై దగ్గరిపడిన దానిలా అగుపించాలని ప్రయత్నిస్తుంది. అలాగే ప్రవర్తిస్తుంది. ఇదంతా చూసిన మాధవయ్య, "నా చిట్టితల్లికి ఎంత అణకువ, ఎంత మర్యాద వచ్చిందండీ" అనేవాడు సోమయాజితో అప్పుడప్పుడూ.

ఎందుకో చినబాబు బెంగుళూరు వెళ్లకుండా ఇక్కడే వుండిపోయాడు. కారణం ఎవ్వరికీ తెలియదు. కాని చినబాబుకి తెలుసు– కౌముదిని తనవెంట బెంగుళూరు తీసుకువెళ్లితే తన వూహలకు దూరంకావడేమే కాకుండా పరిసరాలకు కూడా దూరమవడంచేత ఏమైపోతుందోనన్న భయం. ఆమెలో కొంత మార్పు వద్చాక తనవెంట తీసుకెళదామని నిర్ణయించుకున్నాడు. కాని తాను ఎంత తియ్యగా వీణాగానం చేసినా, ఎంత మృదువుగా పలకరించినా కౌముదిలో చలనం లేదు. ఏదో పెద్ద షాక్ తిని గతాన్ని మర్చిపోయినదానిలా బతుకుతోందే తప్ప మామూలుగా లేదు కౌముది. చినబాబుకు అన్ని సపర్యలూ చేస్తుంది.. పలకరిస్తే పలుకుతుంది. తనంతట తాను పలకరించదు. ఆమె ఒక మరబొమ్మ.

చినబాబు వయస్సు మళ్లినవాడే. అనాకారే. మాట గంభీరమే కాని అతని మనస్సు వెన్న. అందుకే కౌముదిని ఏనాడూ నొప్పించలేదు. ఆమె యిష్టానికి వ్యతిరేకంగా అతను ప్రవర్తించలేదు. అతనంటే కౌముదికి భయమూ, భక్తీ వున్నాయి. కాని ప్రేమ లేదు. అతనికి ఆమె అంటే జాలీ, అభిమానమూ వుంది. కాని ఆమెపై కోర్కె లేదు. అదీ కౌముదీ, చినబాబుల దాంపత్య జీవితం.

అతను అనునిత్యం అసురసంధ్యవేళ ప్రారంభించి, రాత్రి


For all your requirements of Paper Bags, Polythene Bags,
Butter Paper Bags and Envelopes

**Andhra Paper Bag Company**

General Bazar, SECUNDERABAD-500 003. Tel 72749

*Seasons Greetings and Best Wishes from*

**Mysore Paper Corporation**

General Bazar, Secunderabad-500 003 Tel 72749

*Agents for* :

Sun Paper Company — Mfrs. of 'Lustre Cote' Art Paper, Art Card and Chromo Paper Rohit Pulp and Paper Mills Ltd.,—Mfrs. of 'Pearl Glow' Art Paper, Art Card, Chromo Paper, Bankers Ledger and White Maplitho. Mysore Paper Mills Ltd.—Mfrs. of 'Bison' brand White and Kraft Paper.

పదిగంటల దాకా వీణపై సాధనచేస్తూనే వుంటాడు. ఆమె కిటికీలోంచి కొండపైనుంచి జాలువారుతూన్న జలపాతాన్నీ, కొండల్నీ చూస్తూ వుండిపోతుంది. అతని సంగీత సాధనను వినడానికి ఆ వేళకు ప్రతిరోజూ లేడీ, పామూ, నెమలీ, లేగదూడా ఈ మధ్య చాలామంది జనం వస్తూనే వున్నారు. సాధన జరుగుతూన్నంతసేపూ అంతా తన్మయత్వంలో వుంటారు. సాధన పూర్తికాగానే నిద్రనుంచి మేల్కొన్నట్లు అంతా ఈ లోకంలోకి వచ్చి ఎవరిదారిన వాళ్లు వెళ్లిపోతారు.

అది ఇంద్రగిరి కోటలో జరుగుతూన్న దినచర్య. కౌముది, చినబాబుల నూతన దాంపత్యం తీరు.

## 8

పుష్యమాసం వచ్చింది.

రైతులు పొలంపన్లు పూర్తిచేసుకున్నారు. కుప్పలు నూర్చి, పంటను గాదెల్లో నిల్వచేసుకున్నారు. కొంత పంటను అమ్ముకొని పండగ ఖర్చులకు, కొత్త అల్లుళ్ల ముద్దుముచ్చట్లు తీర్చడానికి సొమ్ముచేసి దగ్గరుంచుకున్నారు.

ఆ సమయంలో గోపాలందాసు ఇంద్రగిరి వచ్చాడు. పురోహితుడు సోమయాజినీ, మాధవయ్యనూ, పట్టణంలోని పెద్దల్నీ కల్సి రామాయణకథో, భారతకథో హరికథగా చెబుతానని విన్నవించుకున్నాడు.

ఆ కాలంలో ఏటా ఏవరో ఒక దాసుగారొచ్చి రామాలయంలో హరికథ చెప్పివెళ్లడం మామూలే. ఈసారి గోపాలం వచ్చాడు. గోపాలం పాతికేళ్ల యువకుడు. కన్నూ, ముక్కూ బావుంటాయి. పెద్ద ఎత్తూ కాదు, పొట్టీ కాదు. 'కుర్రాడు భలే బావున్నాడు' అనిపించే అందం. మాటలోనూ, మనిషిలోనూ కూడా ఏదో మృదుత్వం. ఇదంతా చూసి మాధవయ్య, "భారతకథ మీరు చెప్పగలరా?" అన్నాడు సంశయంగా గోపాలందాసుతో.

"ఒక్కరోజు నన్ను చెప్పనిచ్చి, నచ్చకపోతే ఆపేసేయండి." అన్నాడు వినయంగా గోపాలం.

"ఇంతకీ మీ గురువెవరు?" సోమయాజి అడిగాడు.

"నారాయణదాసుగారికి ఏకలవ్య శిష్యుడ్ని నేను."

"ఆఁహాఁ! సరే! రేపట్నుంచే ప్రారంభించండి. పూజారి గారితో చెబితే స్వామివారికి ఎదురుగా బల్లలు వేయిస్తారు. తమరెక్కడ వుందామనుకుంటున్నారు?"

"తమరెక్కడ వుండమంటే అక్కడ."

"ఎక్కడో ఎందుకూ నాతోపాటు కోటలోనే వుంటారు లెండి." అన్నాడు మాధవయ్య.

"ఇక సమస్యేలేదు. మరి మీ హంగుదార్లు?"

"ఉన్నారు. పక్కవూళ్లోనే వుంటారు. రోజూ వచ్చి కథ


*With best compliments from*

**UNI - SANKYO LIMITED**

**Manufacturers of Quality Bulk Drugs**

*in Collaboration with*

**SANKYO COMPANY LIMITED, JAPAN**

*Factory :* Gaganpahad, Hyderabad-West. Andhra Pradesh

*Office :* 5-9-24/81, Shapurwadi, Hyderabad-500 483 A.P.

అయిపోగానే వెళ్లిపోతారు. నా మనవి ఏమిటంటే రేపట్నుంచి హరికథ మొదలపెడుతున్నట్టు చాటింపు వేయిస్తే జనం వస్తారని. మొదటి రోజునైనా పెద్దలు మీరంతా తప్పక రావాలని నా కోరిక."

"అది మామూలేలెండి. మునసబుగారు చూసుకుంటారు." అని చెప్పి లేచాడు సోమయాజి.

"రాత్రి తొమ్మిది దాటితేగానీ కథ మొదలుపెట్టకండి బాబూ! దుకాణాలవీ మూసుకొని, ఆ టైంకు కానీ జనం చేరలేరు." అని సలహా యిచ్చాడు మాధవయ్య.

"తమ రెలా అంటే అలాగేలెండి." అన్నాడు వినయంగా గోపాలం.

"రండి. మా ఇల్లు చూపెడతాను." అని గోపాలాన్ని తనవెంట కోటలోకి తీసుకొచ్చాడు మాధవయ్య.

తన ఇల్లూ, గోపాలం వుండాల్సిన గదీ చూపెట్టాడు మాధవయ్య. వెనకటి రోజుల్లో ఊరుగూరినుంచి పండితులు గానీ కళాకారులు గానీ వస్తే కోటలోనే బసచేసేవారని, రాజుగారు యిక్కడ లేకపోవడంతో ఆ ఆచారం తప్పిపోయిందని గోపాలానికి మాధవయ్య వివరించాడు.

"మరి నన్ను ఇప్పుడెందు కుండమంటున్నారు?" అడిగాడు గోపాలం.

"మళ్లీ మా చినబాబుగారు వచ్చేశారిక్కడకు. వారు వచ్చి యిక్కడున్నారంటే మళ్లీ ఆ పాత మర్యాదలు మామూలుగా సాగాల్సిందేగా!" అన్నాడు మాధవయ్య.

చినబాబు తన మనవరాలి మొగుడని మాత్రం ఆయన చెప్పలేదు.

"అయితే మనం చినబాబుగార్ని కూడా కథకు రమ్మనమని స్వయంగా ఆహ్వానించాలిగా!" అన్నాడు ఆశగా గోపాలం.

"పిల్చినా వారు బయటకు రారు. మీరు ఆలయంలో కథ చెబుతూ వుంటే, దర్బారుహాలు మేడమీది గదిలోకి, రాణీ మహల్ గదిలోకి రాత్రిపూట చక్కగా వినబడుతుంది. మనిషి స్పష్టంగా కనబడడు. తమ కథ చినబాబుగారికి నచ్చితే, ఏదో ఒకరోజున వారే మిమ్మల్ని పిలిపించి గౌరవించి పంపుతారు."

"ఆ అదృష్టం నాకుందో లేదో!" అన్నాడు గోపాలం.

* * *

పట్టణంలోని రామాలయంలో హరికథా కాలక్షేపం ప్రారంభమైంది.

రాత్రి పదిగంటలైంది.

వాతావరణం ప్రశాంతంగా వుంది.

**RAJAN ART WORKS**

Cine Jewellers and Shields Makers

45, North Md. Usman Road,
T. Nagar, MADRAS-600 017

Phone : P.P. 445292

చినబాబు ఒక గంటక్రితమే సాధన పూర్తిచేసుకొని భోజనంచేసి పడుకున్నాడు. కిటికీలోంచి చల్లని గాలి వీస్తోంది.

గోపాలం గళమెత్తి పాడుతున్న పాట ఇంకా మెలకువగా వున్న కౌముది చెవినపడింది. అతని తియ్యని కంఠం ఎంతో హాయిగా అనిపించిందామెకు. లేచి కూర్చుంది. కిటికీలోంచి చూసింది. ఆ కిటికీలోంచి చూస్తే ఆలయప్రాంగణం స్పష్టంగా కనబడుతోంది. ఒకచేత చిడతలు మోగిస్తూ లయబద్ధంగా చిందులేస్తూ కథ చెబుతూన్న గోపాలం కౌముదికి చిన్న బొమ్మలా కనిపించాడు. అతను గెంతుతూ పాడుతూ వుంటే ఇన్నాళ్ల తర్వాత ఆమెలో ఏదో కొత్త చలనం వచ్చింది. ఆమెకు తెలియకుండానే ఆమె పాదాలు కంపించాయి.

నిద్రపోకుండా అతను చెబుతూన్న కథను సాంతం వింది కౌముది.

మంచి గొంతు, చాలా బాగా చెబుతున్నాడు అనుకుంది కౌముది నిద్రపోబోతూ.

మరునాడు అతను కథ ఎప్పుడు ప్రారంభిస్తాడా అని ఎదురుచూసింది.

విఘ్నేశ్వర ప్రార్థన చేసి కథ ప్రారంభించాడు గోపాలం. పదిగంటలకు కథ మంచి రసపట్టులో పడింది.

ఆ రోజు అతను అర్జునుడ్ని గురించి వర్ణిస్తున్నాడు.

కౌముదికి గోపాలం అర్జునుడా అనిపించాడు. అతన్ని దగ్గరనుంచి చూడాలనుకుంది.

రాత్రి పదకొండు గంటలు కావస్తోంది.

రెప్ప ఆర్పకుండా అతన్నే చూస్తూ అతని గానానికి తన చెవులను అర్పించి ఏదో లోకంలో వున్న అనుభూతిని పొందుతోంది. అతను వేస్తూన్న చిందుకు అనుకోకుండా ఆమె శరీరం కంపించింది. తనకు తెలియకుండానే ఆమె లేచింది. మర్యాదలూ, సాంప్రదాయాలూ ఆమెమర్చిపోయింది. చినబాబు ఆమె మెళ్లో తాళికట్టిననాటినుంచి రాణి కౌముదీ దేవిలా ప్రవర్తించినా, గోపాలం పాట, ఆట విన్నతర్వాత కళ్లారా చూసింతర్వాత ఆమె మాధవయ్య మనవరాలిగా మారిపోయింది. పాత చలాకీతనం ఆమెలో తలఎత్తింది. పైన శాలువాకూడా కప్పుకోకుండా చకచకా రాణిమహల్ నుంచి దిగి, కోట సింహద్వారం దాటి ఇంచుమించు పరుగు లాంటి నడకతో గోపాలం కథ చెబుతూన్న ఆలయానికి చేరుకుంది.

జనమంతా కథలో నిమగ్నులై వున్నారు.

కౌముది జనం వెనుక కాస్త ఎడంగా కూర్చుంది.


# శ్రీ శ్రీనివాస పేపర్ కన్వర్టర్స్

(ఆర్.ఎన్.ఐ. న్యూఢిల్లీ వారిచే అనుమతించబడిన న్యూస్ప్రింట్ ఏజంట్లు)

**7, మురుగేశ ముదలై స్ట్రీట్, కొండితోపు,**

**మద్రాసు - 600 079.**

**ఫోన్ : 38359**

అధునాతన ఆటోమాటిక్ న్యూస్ప్రింట్‌రీల్ కటింగ్ మిషిన్‌లపై నిపుణులైన వారితో చేయించటం మా ప్రత్యేకత.

1. సకాలంలో, వెంటనే పనిచేసి యిచ్చుటకు మా గ్యారంటీ.
2. వైట్ ప్రింటింగ్ రీళ్లను పార్టీ ప్రమాణాలమేరకు కటింగ్‌చేయబడును.
3. మా ఖాతాదారులకు అతి చౌకరేట్లలో రీళ్ళ క్లియరింగ్ & ఫార్వార్డింగ్ చేయించగలము.
4. "తక్కువ వేస్టేజి, ఎక్కువ రీములు" యిచ్చే పూచీ.

ఎవ్వరూ ఆమెను చూడలేదు. ఆమెకు గోపాలందాసు తప్ప ఎవ్వరూ కనిపించటంలేదు కూడా.

గోపాలం కథా విధానమే చిత్రంగా వుంటుంది. నవరసాలు మేళవించి కథను చెప్పగల ప్రజ్ఞావంతుడు గోపాలం. చక్కటి గాత్రం,పచ్చటి శరీరఛాయ, అయస్కాంతాల్లాంటి కళ్లు, అతని ప్రతి కదలికా ఆకర్షణీయంగానే అగుపించేలా చేస్తాయి. మెడలో మల్లెపూలదండ వేసుకొని, పట్టు పైపంచతో నడుం బిగించి, అతను చిందులేస్తూ పాడుతూవుంటే, అతనొక గొప్ప నాట్యాచార్యునిలా కనిపిస్తున్నాడు కౌముదికి. అతను నీరులా ఏ పాత్ర గురించి చెప్పినప్పుడూ, ఆ పాత్ర ఆకృతికి సడలిపోతున్నాడు. ధర్మరాజు గురించి చెప్పినప్పుడు ధర్మరాజులా, అర్జునుడ్ని గురించి చెప్పినప్పుడు అర్జునిడిగా, కృష్ణుడ్ని గురించి చెప్పినప్పుడు కృష్ణునిగా, చివరకు ద్రౌపదిగా కూడా గోపాలం తన హావభావాలతో ఆయా పాత్రలలాగే కనిపిస్తున్నాడు.

కథ పూర్తి కాబోతూన్న సమయాన, జనంకంటే ముందు కౌముది లేచి కోటకు వెళ్లిపోయింది.

మరునాడు ఉదయాన్నే గోపాలం కోనేటికి స్నానానికి వెళ్లాడు. అతను స్నానంచేస్తూ వుండగా కౌముది రాణీమహల్ నుంచి చూసింది. కోనేటి నీళ్ళల్లో దిగిన గోపాలం ఏదో కూనిరాగం తీస్తూ స్నానం చేస్తున్నాడు. అతను స్నానం పూర్తిచేసుకొని తిరిగి మాధవయ్య ఇంట్లోకి వెళ్లేదాకా అతన్నే చూస్తూ వుండిపోయింది.

ఒకసారి ఆమె వెనుకనుంచి చినబాబు కూడా గోపాలాన్ని చూసిన సంగతి ఆమెకు తెలియదు.

'అయితే దాసుగారు కోటలోనే వుంటున్నారన్నమాట!' అనుకుంది కౌముది.

ఒక్కక్షణం ఆలోచించి తిన్నగా వంటగదివైపు వెళ్లింది. వంటవాడు చేతులు కట్టుకు నిలబడ్డాడు.

"ఏమిటి వంటకాలు?" అడిగిందామె.

అతను చెప్పాడు.

"మాధవయ్య తాతగారికి భోజనం పంపిస్తున్నావా? ఆయనే ఇక్కడికి వస్తున్నాడా?"

"మధ్యాహ్నంపూట తాతగారూ, దాసుగారు కల్సి భోజనాని కొస్తారమ్మా! రాత్రిళ్లు దాసుగారు కథ అయ్యాక భోజనం చేస్తారట. అందుకని భోజనం దాసుగారికి అక్కడికే పంపిస్తున్నాను. తాతగారు మాత్రం పెందరాళే ఇక్కడే భోంచేస్తారు." అన్నాడు వంటవాడు.

"సరే! ఈ రోజు గారెలూ, పరమాన్నం చేయి." అని


*With best compliments from*

**GOLDEN PRESS**

**QUALITY OFFSET PRINTERS**

**GOWLIGUDA, HYDERABAD - 500 012.**

**Phone : 52521 52522 52523 52524**

ఆదేశించి, "తాతగారు మధ్యాహ్నం భోజనానికొచ్చినప్పుడు నాతో చెప్పు" అని వెళ్ళిపోయింది కౌముది.

మధ్యాహ్నం ఎప్పుడవుతుందా, ఎప్పుడు దాసుగారు తాతయ్యవెంట భోజనానికి వస్తారా, ఎప్పుడు కళ్లారా అతన్ని దగ్గరగా చూడవచ్చా అని వేయికళ్లతో ఎదురుచూస్తోందామె.

వంటవాడు వచ్చి "తాతగారొచ్చారమ్మా! భోజనం వడ్డించి, ఇలా వచ్చాను" అన్నాడు.

కౌముది గబగబా వంటగదివైపు వెళ్లింది.

తీరా చూస్తే తాతయ్య ఒక్కడే భోంచేస్తున్నాడు. మాధవయ్య వెంట దాసు కనబడకపోవడంతో నిస్పృహ చెందింది కౌముది, 'దాసుగారు రాలేదేం తాతా?' అని అడుగుదామనుకొంది.

ఇంతలోనే మాధవయ్య కౌముదిని పలకరించి, తన ఎదుట కూర్చోబెట్టుకున్నాడు.

"కాస్త మిరియాల రసం పెట్టి ఇంటికి తీసుకురా! పాపం, ఆ గోపాలానికి వొంట్లో బావుండలేదు" అని వంటవాడికి పురమాయించాడు మాధవయ్య.

'అయ్యో! పాపం,' అనుకొంది మనస్సులోనే కౌముది. అప్పుడే వెళ్లి చూడాలనిపించింది గోపాలన్ని. కాని ధైర్యం చాలలేదు. సభ్యత అడ్డొచ్చింది.

సాయంత్రపు వేళ అలా పూలతోటవైపు వెళ్లింది చాల రోజుల తర్వాత. తాను యిదివరకుండే ఇంటి ముందు ఆరుబయట గోపాలం సిమెంట్ సోఫాలో కూర్చున్నాడు. ఏదో పుస్తకం చదువుకుంటున్నాడు. అతన్ని అక్కడ చూడగానే అటు వెళ్లింది కౌముది. అతని చేతుల్లో మాధవయ్యతాత చదువుకొనే భారతం ఉంది. అది చూసి "భారతం చదువుతున్నారా?" అని కౌముదే పలకరించింది గోపాలాన్ని.

గోపాలం ఉలిక్కిపడ్డాడు.

ఆమె పలకరింపు వీణానాదంలా వుంది. ఆ పలకరింపులోని ఆప్యాయత వెన్నెల కంటె చల్లగా వుంది. ఆమె ఎవరో అతనికి తెలియదు. బదులు ఏం చెప్పాలో తెలియటం లేదు. ఏ అప్సరసో దివినుంచి భువికి అప్పుడే దిగిందా? అన్నట్లుంది- అతని ముందు కౌముది నిలబడటం.

"మీరు...." అని మాత్రం అనగలిగాడు దాసు.

కౌముది వెనకనుంచి వచ్చిన మాధవయ్య-

"రాణీ కౌముదీదేవి బాబూ!" అన్నాడు.

గోపాలం అప్రయత్నంగానే లేచి నిలబడ్డాడు. చేతులు జోడించి నమస్కరించాడు.

కౌముది ప్రతినమస్కారం చేసింది.

"వీరు మా తాతయ్య," అందామె.


*With best compliments from*

**BATCHU LINGIAH & SONS**

**PAPER MERCHANTS**

GENERAL BAZAR, SECUNDERABAD-500 003.

Grams : "NEWSPRINT" Phone : 72997

ప్రతి సదనంలో, ప్రతి హృదయంలో
విజ్ఞాన జ్యోతులు వెలిగించే
సా హి తీ దీ పి క ల వ రు స

| | | |
|---|---|---|
| కుటుంబరావు సాహిత్యం | మొదటి సంపుటం | రు. 25 |
| కుటుంబరావు సాహిత్యం | మూడవ సంపుటం | రు. 25 |
| స్వీయచరిత్రము-ప్రథమ భాగం | కందుకూరి వీరేశలింగం | రు. 16 |
| బతుకు పుస్తకం | వుప్పల లక్ష్మణరావు | రు. 14 |
| రక్తాక్షరాలు | జూలియస్ ఫ్యూజిక్ | రు. 5 |
| తిలక్ కథలు | బాలగంగాధర తిలక్ | రు. 20 |
| చాసో కథలు | చాగంటి సోమయాజులు | రు. 16 |
| కళ్ళజోడు (కథలు) | పెద్దిభొట్ల సుబ్బరామయ్య | రు. 6 |

న వ ల లు

| | | |
|---|---|---|
| చీలని పాయలు | డా॥ పొన్నాల యాదగిరి | రు. 8 |
| పట్టణంలో బతుకుదామని | ఎం. విశ్వనాథ్ | రు. 6 |
| తిరుగుబాటు | మలయశ్రీ | రు. 8 |
| కనువిప్పు | అకెళ్ళ సూర్య నారాయణ | రు. 9 |
| చీకటి చెదిరింది | దశరథ్ | రు. 8 |
| కూలి బతుకు | సింహప్రసాద్ | రు. 12 |
| వీళ్ళూ మనుషులే | పరుచూరి రాజారామ్ | రు. 9 |
| రెండు నదులు | అరుణ | రు. 8 |
| కన్నీటికి నోరొచ్చింది | కాశీ విశ్వనాథ్ | రు. 10 |
| ఇనప చక్రాలు | యర్రంశెట్టి శాయి | రు. 10 |
| వెదురు పొదలు నినదించాయి | జాతశ్రీ | రు. 7 |
| చదువు | కొడవటిగంటి కుటుంబరావు | రు. 7 |
| గోదాన్ | ప్రేమ్‌చంద్ | రు. 16 |
| చిరస్మరణ | నిరంజన | రు. 14 |
| మాధవి | అనుపమ నిరంజన | రు. 8 |
| సింహ సేనాపతి | రాహుల్ సాంకృత్యాయన్ | రు. 15 |

పోస్టేజీ అదనం! నేడే మీ ఆర్డరు పంపండి!

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
చంద్రం బిల్డింగ్స్ : విజయవాడ - 520 004
విశాలాంధ్ర బుక్ హౌస్
విజయవాడ, హైదరాబాద్, విశాఖపట్నం, తిరుపతి,
గుంటూరు, హనమకొండ, అనంతపురం

"కబురంపితే నేనే వచ్చేవాడ్నిగా అమ్మా!" అన్నాడు మాధవయ్య.

"నేను రాకూడదా?"

"కూడదని కాదు. ఇప్పుడు నువ్వు రాణివి కదమ్మా!"

"అయినా నీ మనవరాల్నేగా తాతా!"

ఇద్దరి సంభాషణా వింటూ నిలబడిపోయాడు గోపాలం. ఆమె అక్కడ వున్నంతసేపూ ఆమెనే చూస్తూ వుండిపోయాడు. తాతతో మాట్లాడుతూన్నా కౌముదిస్థితి కూడా అదే. చివరకు వెళుతూ, "మీ హరికథ చాలా బావుంది." అంది.

గోపాలం మనస్సు పొంగిపోయింది.

"నువ్వు ఎప్పుడు విన్నావమ్మా?" అన్నాడు మాధవయ్య ఆశ్చర్యంగా.

"వారు రాణీమహల్‌లోకి వినబడతారు; కనబడతారు," నవ్వుతూ అని వెళ్ళిపోయింది కౌముది.

ఆ రోజునుంచి గోపాలం తన కథను వింటూన్న కౌముదిని మెప్పించడానికా అన్నట్టు చాలా ప్రజ్ఞాపాటవాలతో కొత్త ఉత్సాహంతో కథను చెబుతున్నాడు.

పగలు ఏదో వేళప్పుడు కౌముది గోపాలాన్ని కలుస్తోంది, అతన్ని చూడకపోతే ఆమెకు తోచదు. ఆమె అగుపించని రోజున గోపాలం కథ బాగా చెప్పలేడు. అదేమాట గోపాలం ఆమెతో ఒకరోజున ధైర్యంచేసి చెప్పేశాడు. అలా వారిరువురి పరిచయం స్నేహంగా మారింది. ఇద్దరూ గంటలతరబడి కల్సి మాట్లాడుకోవాలని, ఈ సారి కనబడినప్పుడు మనస్సు విప్పి చెప్పేయాలని ఇద్దరూ అనుకొనేవారు. తీరా కలిస్తే ఇద్దరూ ఏం మాట్లాడుకోలేక పోయేవారు. ఒకరి నొకరు చూసుకుంటూ మౌనంగా వుండిపోయేవారు.

## 9

నెలరోజులపాటు సంగీత నృత్య ఝరీప్రవాహంలా సాగిన గోపాలం హరికథ ఆ రోజుతో అఖరని హరికథా ప్రియులకు, భక్తులకు తెలిసింది. కథ పూర్తయినతర్వాత కూడా అందరి హరిదాసుల్లాగే ఇంద్రగిరిలో గోపాలం మరో రెండు రోజులు ఉండదల్చాడు, అఖరిరోజున, ఆ తర్వాత రెండుమూడు రోజుల్లోనూ పెద్దలదగ్గరకెళ్ళి కలవడం రివాజు. పెద్దలు కథ గురించి రెండుమూడు మాటలు చెప్పి, దాసుగార్ని సత్కరించడం మామూలు. ఆ తతంగంకోసమే గోపాలం కథ పూర్తయ్యాక కూడా మరో రెండురోజులు ఉండదల్చాడు.

నిజానికి గోపాలం ఆ వూరు వొదిలి వెళ్ళడానికి ఇష్టంగా లేదు. అసలు వెళ్ళబుద్ధి కావడంలేదు. రేపట్నుంచి కౌముది ఒక్కసారికూడా కనిపించదు అన్న ఆలోచన మనసుకు వస్తే, రేపట్నుంచి గుడ్డివాడ్ని అయిపోతానన్నంత బాధగా ఉండేది

గోపాలానికి. ఈ మాట మనస్సువిప్పి చెప్పాలని వున్నా, చెప్పడం చేతగాకా, చెప్పేటంత అవకాశంలేకా విలవిల్లాడు తున్నా డతడు.

కౌముది స్థితికూడా అదే.

కథ పూర్తయ్యాక గోపాలం వెళ్ళిపోతాడు; రేపట్నుంచి అగుపించడు అని విన్నప్పుడు - రేపట్నుంచి సూర్యుడు ఉద యించడు; ఇహ చీకటే అనిపించింది కౌముదికి. అతను వెళ్ళే లోపున, అతనితో ఏవేవో మాట్లాడాలని ఆరాటపడుతోంది. ఎప్పుడు కలవాలో, ఎక్కడ కలవాలో తోచటంలేదు.

గోపాలం వెళ్లడానికి ఒకరోజు ముందు సాయంత్రప్పేళ కౌముది పూలతోటలోని సిమ్మెంటు సోఫామీద కూర్చుంది. చిరుగాలికి కదులుతూ మౌన సుందరాంగుల్లా వున్న విరిసిన పూలనుచూస్తూ మౌనంగా వుందామె.

ఊళ్లో తిరిగి కోటలోకి వస్తూన్న గోపాలానికి తోటలోని కౌముది కనిపించింది. మాధవయ్య ఇంటివైపుకు నడవ వల్సిన వ్యక్తి తోటవైపు నడిచాడు. పరధ్యానంగా వున్న కౌముదిని ఎలా పలకరించాలో తెలియక కాసేపు గోపాలం కూడా మౌనంగా వుండిపోయాడు. ఏదో ఆలోచన అతని మన స్సులో మెరిసింది. నిశ్శబ్దంగా మల్లెపందిరి దగ్గరకు వెళ్లాడు. దోసెడు మల్లెపూలు కోశాడు.

దిగంతంలోకి చూస్తోన్న కౌముది మౌనానికీ, ధ్యానానికీ భంగం కలగకుండా, తన దోసెడులోని మల్లెల్ని ఆమె అందాల పాదాలపైన జాలువార్చాడు. చల్లని మల్లెల తాకిడికి కౌముది ఉలిక్కిపడి, "ఏమిటండీ యిది!" అంది.

"ఆరాధన," అన్నాడు గోపాలం ఆమె కళ్లల్లోకి భక్తుడిలా చూస్తూ.

ఆమె సోఫానుంచి లేచి నిలబడింది. నెమ్మదిగా తోటకు మూలగావున్న గుబురుగా ఎదిగిన సంపెంగ పొదవైపు నడవసాగింది. రాణి కౌముది అలా నెమ్మదిగా నడుస్తూవుంటే ఆమె వెనుక గోపాలం మహామంత్రిలా నడుస్తున్నాడు. ఏదో విన్నవించుకోవాలన్న తపన అతనిలో వుంది. ఇంతకంటె సదవకాశం కొరకదనుకున్నాడు.

"నా కథ బావుంది అని మీరు మెచ్చుకున్నారు. ఒకసారి కాదు, ఇంచుమించు రోజూ మెచ్చుకున్నారు. మీరు మెచ్చు కున్నప్పుడల్లా ఇంకా బాగా చెప్పాలని తాపత్రయపడేవాడ్ని. ఆ తాపత్రయంలో నేను ఎప్పుడూ చెప్పనంత బాగా చెప్పాను గదా! నిజానికి మీ మెప్పుకోసమే కథ చెప్పానా అనిపిస్తుంది. అనిపించదమేమిటి? అదే నిజం!"

కౌముది వెనక్కు తిరక్కుండానే వోరగా అతని కళ్ల ల్లోకి చూసింది. అదే సమయానికి అతని చూపులు కూడా ఆమె చూపులతో కలిశాయి.

గోపాలానికి ధైర్యం వచ్చింది.

ఆమె చూపుల్లో అతనికి కనిపించిన ప్రసన్నతా, ఆప్యా యతా గోపాలాన్ని ఇంకా మాట్లాడించాయి.

"రేపు నే నిక్కణ్నుంచి వెళ్లాలి. వెళ్లాలంటే ఎక్కడో ఏదో రాచకార్యం ముందనికాదు. ఇక్కడ కథ అయిపోయింది కాబట్టి వెళ్ళిపోవాలి. మరోచోటు చూసుకొని కథ చెప్పాలి. కాని ఇంకా నేను కథ చెప్పలేను."

"ఎందుకనీ!" ఆశ్చర్యంగా అంది కౌముది.

"అక్కడ మీ రుండరు. మీరు లేని సభ నా దృష్టిలో సభ కాదు."

"అయితే నే లేకపోతే కథ చెప్పరా!"

"చెప్పలేను."

"ఎందుకనీ!"

"వసంతం రానిదే కోయిల ఎందుకు పాడలేదూ! చంద్ర కిరణాలు సోకనిదే కలువలు ఎందుకు వికసించవు!"

"నేను వసంతాన్నా? వెన్నెలనా!"

"మీకు తెలుసా? కౌముది అంటే వెన్నెలే, మీరు వెన్నె లైతే నేను కలువనే- ఒక్క మాటలో చెప్పాలంటే, మీరు లేనిదే నేను లేను. అసలు నేను బ్రతకలేను." ఆ మాటకు ఉలిక్కిపడింది కౌముది. అతని కళ్లల్లోకి చూసింది.

అతని కళ్లు అప్పటికే కొద్దిగా చెమ్మగిల్లాయి. అతను కళాకారుడు. ఆవేశం ఎక్కువ. చెప్పదల్చుకున్నది సూటిగా, బలంగా చెప్పగలడు.

"నిజమండీ! మీరు లేనిదే నేను బతకలేను. మీకు తెలియదు. నేను లేకుండా మీరూ సుఖంగా వుండలేరు. మీకు నేను కావాలి. నాకు మీరు కావాలి." ఆ మాటల్ని వినగానే కౌముదికి భయమేసింది. అతను చెప్పింది నిజమేననిపించింది.

'నిజానికి నిజాన్ని భరించడం, తట్టుకోవడం చాలా కష్టం.' అనుకుంది కౌముది. ఇంక అక్కడ నిలబడలేక వేగంగా నడిచి రాణీమహల్‌లోకి వెళ్లిపోయింది.

తన పడకగదిలోకి అడుగుపెడుతూ వుంటే చినబాబు, "తోటలో వున్నావా? నీ కోసం తోటంతా వెతికాను." అని పలకరించాడు.

కౌముది నెత్తిన పిడుగుపడ్డట్టయింది. బదులు చెప్పలేదు. వెళ్లి మంచంమీద పడుకొంది.

చినబాబు నౌకర్ని పిల్చాడు. గోపాలాన్ని పిల్చుకు రమ్మన్నాడు.

ఎలక్ట్రిక్ షాక్ తగిలినదానిలా అయిపోయింది కౌముది.

ఆమె మెదడు ఆలోచించడం మానివేసింది. ఏదో ఘోరం జరగడం ఖాయం అన్న నిర్ణయాని కొచ్చిందామె.

## 10

తోటలోంచి కౌముది వెళ్లిపోయిన వెంటనే గోపాలం తను వుంటూన్న మాధవయ్య ఇంట్లో కొచ్చాడు. కొద్ది సేపట్లోనే చినబాబు రమ్మంటున్నారంటూ నౌకరు వచ్చి చెప్పాడు.

గోపాలం మనస్సు పరిపరివిధాల పోయింది. తనూ కౌముదీ పూలతోటలో మాట్లాడుకోవడం రాజావారు చూసుంటారు. అందుకే పిల్చివుంటారేమో, దీనికి శిక్ష ఏమిటో? శిక్ష ఏమైతే నేం, తాను పొందిన కౌముది మెప్పు, కౌముదితో తాను గడిపిన ఆ కాసేపట్లో తాను పొందిన ఆనందం, ఎటువంటి శిక్ష తనకు ఆయన విధించినా- వాటి ముందు ఆ శిక్ష గడ్డి పరకకు సరికాదు అనుకున్నాడు. నౌకరు వెంట నడిచాడు గోపాలం.

నౌకరు రాణీమహల్ వైపు దారితీశాడు.

"ఇటెక్కడికి? దర్బారు హాలుకు కాదా మనం వెళ్ల వల్సింది." అన్నాడు గోపాలం.

"చినబాబు రాణీమహల్‌లోనే వున్నారు." అన్నాడు నౌకరు ముక్తసరిగా.

అయితే కౌముదీ తనమీద ఫిర్యాదుచేసిందా? తనకు నాతో మాట్లాడాలని వున్నా, నేనంటే ఇష్టమే అయినా రాజావారు ఆమె నాతో తోటలో వున్నారని గ్రహించి, తను తప్పించు కొనేందుకు ఇలా చేసివుంటుందా?.... ఒక్కక్షణం అలా ఆలోచించాడు. మరుక్షణంలోనే తనను తాను తిట్టుకున్నాడు. తను ఎంతగానో ప్రేమించే వ్యక్తినే అనుమానించే చపలత్వానికి తన మనస్సు దిగజారినందుకు తనను తాను ఎంతగానో తిట్టుకున్నాడు. కౌముది తనకు అపకారం తలపెట్టదు. అలా తలపెట్టడంలోనే ఒకవేళ ఆమెకు తృప్తీ, ఆనందమూ వుంటే అంతకంటే వేరే వరం ఏంకావాలి నాకు? అనుకొంటూ రాణీ మహల్‌లోకి అడుగుపెట్టాడు గోపాలం.

నౌకరు గోపాలన్ని మేడమీదకు తీసుకెళ్లాడు.

పడకగదికి ముందున్న హాలులో చినబాబు వున్నాడు. గోపాలాన్ని చూసి, "రండి దాసుగారూ! కూర్చోండి." అని ఆహ్వానించాడు.

ఆయన గంభీరస్వరం, ఎత్తయిన విగ్రహం గోపాలాన్ని కాస్త కలవరపరిచాయి.

ఆయన నిలబడే వుండటంతో గోపాలం కూర్చోలేదు.

చినబాబు సోఫాలో కూర్చుంటూ, "కూర్చోండి!" అంటూ గోపాలానికి ఎదురుగావున్న సోఫా చూపించాడు.

'రాజులు ఆగ్రహానుగ్రహాలు చూపించే తీరు వేరుగా వుంటుందంటారు. ఇది తనపట్ల ఆగ్రహమో, అనుగ్రహమో!' అనుకున్నాడు మనస్సులోనే గోపాలం. తలెత్తి చినబాబు మొహంలోకి చూడలేకపోతున్నాడు.

కింద పర్చిన తివాచీమీద డిజైన్లు చూస్తున్నాడు గోపాలం.

"మీరు చాల బాగా చెప్పారట కథ. ఆలయానికి నేను రాలేదుగానీ, కోటలో వుండే విన్నాను. మంచిగాత్రంమీది." అని మెచ్చుకున్నాడు చినబాబు.

"అంతా తమ అభిమానం" అన్నాడు పైకి గోపాలం. కాని మనస్సులో మాత్రం కౌముదీదేవి ప్రోత్సాహబలం అనుకున్నాడు.

"సంగీతంలో వర్షాలు కురిపించవచ్చని, రాళ్లను కరిగించ వచ్చని మనందరం విన్నదే. మనిషి మనోవ్యాధిని కూడా బాగుచేయొచ్చని కొందరు శాస్త్రజ్ఞులు అంటున్నారు. ఎందుకో నాకు నిజమే అనిపించేది. సంగీతం కంటె కూడా మనిషి మనోవ్యాధికి సరైన మందు సరిజోడైన మనిషేమోనని పిస్తుంది."

ఈ మాటలకు గోపాలం ఉలిక్కిపడ్డాడు.

గోపాలం కంటె కూడా పడకగదిలో వుండి అంతా వింటూన్న కౌముది సింహగర్జన విన్న లేడిపిల్లలా అయి పోయింది.

ఇంతలో నౌకరు ఒక పళ్లెంలో పట్టుబట్టలూ, తాంబూలమూ పట్టుకొచ్చాడు. దాన్ని చినబాబు అందుకొని గోపాలం దగ్గర కెళ్లి, "తీసుకోండి" అంటూ అందించాడు ఆప్యాయంగా.

గోపాలం అందుకున్నాడు.

తాంబూలంలోవున్న వందరూపాయల నోట్లను చూశాడు. చినబాబు మొహంలోకి చూశాడు. ఆయన మొహంలో గర్వం కనబడలేదు; క్రోధం కనబడలేదు. ఏదో ఆప్యాయత, గౌరవ భావం మాత్రమే కనబడ్డాయి. తనపట్ల వారికింతటి ఆదరణ ఎందుకో గోపాలానికి అర్థంకాలేదు.

గోపాలం తాను అందుకొన్న పళ్లాన్ని పక్కనుంచి, చినబాబుకు వినయంగా నమస్కరించాడు. మరేం మాట్లాడ కుండా వాటిని అందుకొని తానువుంటున్న ఇంటికి వచ్చేశాడు.

ఆ రాత్రంతా కౌముది గోపాలం చెప్పిన మాటల్నే నెమరు వేసుకొంటోంది. 'మీరు లేనిదే నేను కథ చెప్పలేను, మీరు లేందే నేను బతకలేను,' ఆ మాటలు పదేపదే తనకి వినబడు తున్నాయి. అవి ఎంతో తియ్యగా వున్నాయి. అంత తియ్యని మాటలు ఎవరి నోటివెంటా తా నింతవరకూ వినలేదు.

కౌముదికి నిద్రరావటంలేదు. కిటికీలోంచి బయటకు

చూచింది. గోపాలం కథ లేకపోవడంతో ఆలయప్రాంగణం నిర్మానుష్యంగానూ, నిశ్శబ్దంగానూ వుంది.

బయట వెన్నెల ఏదో వెలవెలబోతూన్నట్టుంది.

తోటలో సోఫాలో ఎవరో కూర్చున్నారు. ఎవరై వుంటారు? అనుకుంది కౌముది. వెళ్లి చూస్తే! ఒకవేళ గోపాలం అయివుంటే!.... ఆలోచన మనస్సుకు రాగానే తాను ఆ కోటకు రాణిననీ, చినబాబుగారి భార్యననీ, తన అంతస్తుకూ గోపాలం అంతస్తుకూ మధ్య అగాధం వుందనీ, అతను పరాయి పురుషుడనీ– ఇవేమీ ఆమె మనస్సుకు అనిపించలేదు. మనస్సు అతడ్ని చేరాలని తహతహలాడుతోంది. తనువు కదిలింది. కౌముదిని ఆమె పాదాలు తోటలోకి తెచ్చాయి.

అతను గోపాలం! ఆ వెన్నెల రాత్రిలో కౌముది అతని ముందుకు ఒంటరిగా నిలబడింది. ఎన్నో యేళ్ల తపస్సు తర్వాత దైవ సాక్షాత్కారాన్ని పొందిన భక్తునిలా అయిపోయాడు గోపాలం.

అది కలయేమో అనిపించింది.

"కూర్చోండి." అంటూ సోఫాలోంచి లేచి నిలబడ్డాడు గోపాలం.

కౌముది కూర్చోలేదు.

ఒకరినొకరు చూసుకుంటూ ఇద్దరూ నిలబడే వున్నారు.

"మీరెంత బావున్నారో తెలుసా?" అన్నాడు గోపాలం.

'ఎంత?' అన్నట్టు అతని కళ్లల్లోకి చూసిందామె.

చంద్రకిరణాలు ఆమె కళ్లపైబడి తళుక్కున మెరిశాయి. "సృష్టిలోని వెన్నెలంతా ఒక బొమ్మయి ప్రాణం పోసుకొని నడిచివచ్చినట్లున్నారు మీరు."

ఆమె చిన్నగా నవ్వింది. ఆ నవ్వు శ్రుతిచేసివున్న వీణకు గాలితాకితే వచ్చిన సున్నిత రవళిలా వుంది.

"కౌముదీదేవీ! మొత్తంకాలంతో పోల్చి చూస్తే మనిషి జీవితం చాలా అల్పం. కాని ఏ మనిషికామనిషి తన జీవితాన్ని చూసుకుంటే, ఎక్కువగానే అనిపిస్తుంది. ఇంత దీర్ఘమైన మానవ జీవితంలో మనిషి హాయిగా బ్రతికే క్షణాలు చాలా తక్కువ. ముఖ్యంగా మనిషి తనకు నచ్చినట్టు బ్రతగ్గలగడం చాలా అరుదు. అలా ఒక్కరోజు బ్రతికినా చాలు. కాని అలా ఒక్కరోజు దొరకడం కూడా కష్టమే. తనకు నచ్చునట్టు కలకాలం బ్రతికే కంటే, నచ్చినట్టు ఒక్కరోజు బ్రతికితే చాలు గదా! ఆ తృప్తితో తర్వాత మరణించినా ఫర్వాలేదు." ఆవేశంగా అన్నాడు గోపాలం.

PLEASE VISIT

**VENKATESWARA VASTRALAYAM**

***HOUSE OF FASHION***

***FOR***

RAYMONDS, MODELLA, O. C. M., GWALIOR, BINNY SUITINGS, AND ALL REPUTED MILLS SHIRTINGS.

BRINDAVAN BUILDINGS
5-8-658, NAMPALLY STATION ROAD,
ABIDS CIRCLE, HYDERABAD - 500 001

Phone : 221227

శ్రద్ధగా వింది కౌముది. అతను చెప్పింది నిజమే అనిపించింది కౌముదికి. తనకు నచ్చినట్లు ఒక్కరోజు బ్రతగ్గలగడం కంటె కావాల్సిందేముంది మనిషికి! అతనన్న మాట నిజమే! అనుకుంది.

"మీ విషయమే చూడండి. ఇంత కోటలో ఒక రాణిగా మీరున్నారు. అంతస్తూ, హోదా వున్నాయి. కాని మీమనస్సుకు నచ్చినట్టు మీరు బ్రతకగలుగుతున్నారా? అలా బ్రతుకుతున్నారా? లేదు. నేనూ అంతే. నాకు ఏకాంతంగా మీతో ఒక్కరోజు బ్రతికితే అదే నాకు నచ్చినరోజు. అలా నేను బ్రతగ్గలనా? అలాంటి అవకాశం నా కొస్తుందా?" అన్నాడు గోపాలం.

"గోపాలం! నీ మాటలు ఈ వెన్నెల కంటె హాయిగా వున్నాయి. ఇన్నాళ్లూ నాకేదో కావాలనుకుంటూ వెతుక్కున్నాను. ఏదో పోగొట్టుకున్నదానిలా బాధపడ్డాను. నీ మాటలు విన్నాక నా కర్థమైంది. నాకు కావాల్సింది నాకు నచ్చినట్టు ఒక్కరోజైనా బ్రతగ్గలగడం. అది....అది....అదీ.... నీతో కల్సి ఒక్కరోజు బ్రతగ్గలిగితే....అదే నాకు నచ్చినరోజు..." అందామె....

"అదే నాకూ నచ్చిన రోజు" అన్నాడు గోపాలం.

"కాని ఈ జనం...." భయపడింది కౌముది.

"ఏం చేస్తారు! మనం ఎక్కడున్నామో వెతికి పట్టుకుంటారా? చంపేస్తారు అంతేగా? మనస్సుకు నచ్చినట్టు ఒక్కరోజు బ్రతికాక మరణిస్తేనేం, నచ్చని బ్రతుకు రోజూ బ్రతుకుతూ నిత్యం చచ్చేకంటె, నచ్చినట్టు ఒక్కరోజు బ్రతికి చావడంలో హాయి లేదూ!" అంటూ గోపాలం ధైర్యం చేసి తన కుడిచేతిని ఆమె భుజంమీద వేశాడు.

కౌముది పులకించిపోయింది. అతని చేతిమీద చెక్కిలి వాల్చి, "గోపాలం! నువ్విలా నా భుజంమీద చేయివేస్తే నాకు ఎక్కడలేని ధైర్యమొచ్చింది. నాకేదో పెద్ద అండ దొరికినట్టుంది. ఈ ఎడారి జీవితంలో ఒక ఒయాసిస్ అగుపించిన తృప్తి.... కాని, మనం ఎలా కలవగలం? ఒక్కరోజు వీళ్లందరికీ దూరంగా, ఎవరికీ అగుపించకుండా ఏకాంతంలో ఎలా బతగ్గలం?" అందామె.

"రేపు రాత్రి చినబాబు వీణాసాధన చేసేవేళ అయినా, వినవచ్చే జనం, పశుపక్ష్యాదులూ, చుట్టూ వున్న ప్రకృతీ.... అంతా మైమర్చివుంటారు. ఆ వేళలో కోట దాటాలి." అని సలహాయిచ్చాడు గోపాలం.

'సరే' అంది కౌముది.

## 11

చీకటి పడింది.

కోటలో దీపాలు వెలిగాయి.

రాణిమహల్ కిటికీలోంచి చూస్తోన్న కౌముదికి కోటకు దిగువనున్న పట్టణం కనిపిస్తోంది. కోటనుంచి పట్నందాకా వున్న మెట్లదారి నిర్మానుష్యంగా వుంది. రోడ్డు వచ్చాక ఆ దారి ఎవ్వరూ వాడటంలేదు. రోడ్డు లేనప్పుడు అందరూ ఆ దారినే నడిచేవారు. ఆ దారి కౌముదికి చాలా పరిచయం.

రోజూ ఆ వేళకు చినబాబు వీణాసాధన ప్రారంభించేవాడు. ఎందుకో ఆ రోజున ఇంకా ప్రారంభించలేదు. ఆయన ప్రారంభించకపోయినా అలవాటుపడ్డ జనం నెమ్మదిగా కోటలోకి వస్తున్నారు. నెమలి మెడ ఎత్తి దిక్కులు చూస్తోంది.

కౌముది 'ఇంకా సాధన ప్రారంభించరేమా!' అని లోలోపలే వాపోతోంది. ఉండబట్టలేక "ఈ రోజున ఇంకా వీణాసాధన ప్రారంభించలేదేం?" అని తెగించి అడిగేసింది చినబాబును.

చినబాబు నవ్వుకొని, "ఎందుకో బద్ధకంగా వుంది!" అన్నాడు.

అంతలోనే కౌముది, "ఏంలేదు. జనం కోటలోకి వస్తున్నారు వీణావాయిద్యం వినాలని కాబోలు. అందుకని అడిగాను" అని సర్దుకుంది.

చినబాబు వీణ తీసుకొని సాధన ప్రారంభించాడు. ఆయన అలా వీణాసాధన ప్రారంభించడం కొన్ని నెలల మండు టెండల తర్వాత కురిసిన తొలకరి జల్లులా అనిపించింది కౌముదికి.

వీణాసాధన మంచి రసపట్టులో పడింది.

కోటలోకి వచ్చిన జనం, దర్బారుహాలు ముంగిట కూర్చుని తన్మయులై వింటున్నారు.

అల్లంత దూరంలో పామూ, నెమలీ, లేడీ, లేగదూడా ఎవ్వరూ ఎవ్వరి ఉనికినీ పట్టించుకోకుండా ఆ మృదుమధుర నాదంలో మైమరచి వున్నారు.

కౌముది చిన్న పెట్టె సర్దుకుంది.

గోపాలం కోటదాటి మెట్లదారికి చేరుకున్నాడు.

అప్పుడే చీకటి పల్చబడి, మసక వెన్నెల పుంజుకుంటోంది. ఆ చీకటి వెన్నెలల సంధ్యవేళలో ఊరు చేరుకోవాలని గోపాలం కౌముదికోసం ఆత్రంగా ఎదురుచూస్తున్నాడు.

నిండుగా కప్పుకున్న ఒక ఆకారం అల్లంత దూరాన గోపాలానికి కనబడింది. ఎదురెళ్లాడు. ఆమె కౌముదే!

"వచ్చేశారా!" అంటూ ఆమె భుజంమీద చేయివేసి, తన వెంట ఆమెను నడిపించాడు.

ఇద్దరూ వడుస్తున్నారు.

కౌముది ఏమీ మాట్లాడటంలేదు. ఆమె అడుగులు తడబడుతున్నాయి. కాని అతని స్పర్శలో ఏదో అమరానుభూతిని ఆస్వాదిస్తోంది. ఉచ్ఛ్వాస నిశ్వాసాల సవ్వడి తప్ప మరేమీ వినిపించడంలేదు వారికి.

* * *

కోటలో వీణాసాధన చేస్తూన్న చినబాబు అనాడు రోజుకంటె గొప్పగా వీణను మోగిస్తున్నాడు. ఆ రాగాలాపనల్లో ఏదో ఆవేశం, తీవ్రత స్పష్టమవుతున్నాయి. చుట్టూ వున్న వాతావరణం ఆ మధుర సంగీత నాదంలో వూయల లూపుతోంది. వీణా తంత్రువులను మీటి ఒకచేత మెట్లపై స్వరాల్ని పలికిస్తూ, రెండో చేతిలో తనకు చేరువగానున్న డబ్బాలోని పెట్రోల్‌ను చుట్టూ పోసుకున్నాడు చినబాబు. అలా నాద ప్రవాహానికి ఆటంకం లేకుండానే తననూ, తన వీణనూ తన చుట్టూవున్న పరిసరాలను కౌముదియొక్క ఒక చీరనూ పెట్రోల్‌తో తడిపాడు చినబాబు.

మెట్లదారిన దిగుతోన్న కౌముదీగోపాలాలకు ఏదో వెలుగు కనిపించింది.

కౌముది ఆ వెలుగు ఎక్కడనుంచి వస్తూందో అర్థంకాక వెనక్కు తిరిగి కోటవైపు చూసింది. అవి రాజావారి గదిలోంచి వస్తూన్న మంటలు.

అప్రయత్నంగా తన చేతిలోని పెట్టెను వొదిలేసి కోటవైపు పరుగెత్తింది. ఆమె వెనుకే గోపాలం కూడా పరుగెత్తాడు.

ఇద్దరూ కోట చేరుకున్నారు.

గోపాలం సింహద్వారం దగ్గర ఆగిపోయాడు.

కౌముది సరాసరి చినబాబు గదిలోకి పరుగెత్తింది.

వీణానాదం ఆగలేదు. వినిపిస్తూనే వుంది.

గదిలోకి అడుగుపెట్టిన కౌముది ఎదురుగా మంటల మధ్య వీణాసాధన సాగిస్తూన్న చినబాబును చూసింది. ఆ మంటల వెలుగులో రుద్రవీణను మోగిస్తూన్న రావణాసురునిలా అగుపించాడు ఆమెకు చినబాబు.

"ఏమండీ" అని గావుకేక పెట్టింది కౌముది.

వీణానాదం ఆగిపోయింది.

చినబాబు కళ్లు తెరిచాడు.

"పిచ్చిదానా! ఎందుకొచ్చావు మళ్లీ తిరిగి! నువ్వు నా దగ్గర సుఖపడలేవనీ తెలుసు. ఆ గోపాలంతోనే సుఖపడగలవనీ తెలుసు. నావల్ల నీకు జరిగిన అన్యాయానికి నువ్వు అతనితో వెళ్లిపోవడమే పరిష్కారమనుకున్నాను. కాకపోతే నువ్వూ, నేనూ ఈ కోటలోనే ఈ మంటల్లోనే కాలిపోయామని జనం నమ్మితే ఆ తర్వాత నువ్వు స్వేచ్ఛగా బ్రతకొచ్చు. నీకూ, ఈ వంశానికీ మచ్చ రాకుండా వుంటుందన్న దృష్టితో ఈ పని చేశాను. యిప్పటికైనా మించిపోయింది లేదు. వెళ్లిపోయి హాయిగా బ్రతుకు" అని మళ్లీ వీణను చేతబట్టి మంటల్లో కాలిపోతూనే వీణాతంత్రువుల్ని మీటసాగాడు.

చినబాబు మాటలు కౌముది హృదయాన్ని కదిలించివేశాయి.

"ఏమండీ!" అని ఏడుస్తూ మంటలలో వున్న అతని ఒడిలో వాలిపోయింది.

వలవల ఏడుస్తూనే, "నాకు నచ్చినట్లు ఒక్కరోజు బ్రతకడమే జీవితం అనుకున్నాను గానీ, ఎదుట వ్యక్తి సుఖంకోసం తన ప్రాణాన్నే త్యాగంచేసే మీ గొప్పతనాన్ని అర్థంచేసుకోలేకపోయాను. ఒక్కరోజు సుఖంకంటె మీ వంటి గొప్ప మనస్సు గల మహానుభావుల ఒడిలో కన్ను మూయడం మేలు. నన్ను మన్నించండి." అంది.

వీణానాదం ఆగిపోయింది.

మంటలలో చినబాబూ, కౌముదిల తనువులు కాలిపోయాయి.

ఆ మంటలలో సగం కాలగా మిగిలిందే ఈ వీణ.

వారిరువురి ఆత్మలు ఇంకా యిక్కడే వున్నాయన్న నమ్మకంతో ఆనాటి గోపాలందాసు నడుం వొంగినా, తల నెరిసినా ఈనాటికీ వచ్చి ఏటా కథచెప్పి వెళ్లిపోతూ వుంటాడు. అతనికి తెలిసిన స్త్రీ ఈనాటికీ కౌముది ఒక్కతే. అదీ గోపాలందాసు కథ...." అని ముగించాడు పురావస్తుశాఖ ఉద్యోగి.

Printed and Published A. Chandra Seker Rao at 5-9-88, Public Garden Road, Hyderabad,
for YUVA Publications and Printed at Dolton Press, Public Garden Road, Hyderabad-500 001.
Editor: A. SUDHAKARA RAO